


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 264, పేజీలు - 08

గురువారం, మార్చి 12, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







# మానేపల్లి భూమాయను అడ్డుకోరా.?

- ప్రభుత్వ భూముల కబ్జాకు సహకరిస్తోంది ఎవరు.?
- జీవో నెంబర్ 58, 59 ముసుగులో ప్రభుత్వ స్థలం దోపిడీ
- మానేపల్లి రియాల్టీ అండ్ ఇన్ ఫ్రా పేరుతో హై రైజ్ అపార్ట్మెంట్లో
- కలెక్టర్ మౌనం వెనుక అంతర్యం ఏమిటో.?



- రంగారెడ్డి కలెక్టర్

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రంగారెడ్డి జిల్లా పరిధిలోని తుర్కయంజాల్ ప్రాంతంలో మరోసారి ప్రభుత్వ భూముల కబ్జా వివాదం వెలుగులోకి వచ్చింది. స్థానికుల వివరాల ప్రకారం సర్వే నెంబర్ 212/1లో ఉన్న ప్రభుత్వ భూమిపై మానేపల్లి కుటుంబ సభ్యులకు అక్రమంగా అధికారులకు మామూళ్లు ఇచ్చి ప్రభుత్వ స్థలంలో పాగా వేశారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన కలెక్టర్, రెవిన్యూ అధికారులు మౌనంగా ఉండటం స్థానిక ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమవుతోంది.

## ప్రభుత్వ భూములపై కన్నేసిన భూకబ్జాదారులు

ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములపై కబ్జాలు పెరుగుతున్నాయన్న విమర్శలు తరచూ వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తి. వాటిని పరిరక్షించడం రెవెన్యూ శాఖ బాధ్యత. కానీ తుర్కయంజాల్ ప్రాంతంలో జరుగుతున్న ఘటనలు చూస్తే మాత్రం పరిస్థితి పూర్తిగా భిన్నంగా కనిపిస్తోంది.
సర్వే నెంబర్ 212/1లో ఉన్న భూమి ప్రభుత్వానికి చెందినదని స్థానికులు చెబుతున్నారు. ఈ భూమిని మానేపల్లి వ్యక్తులు ఆక్రమించి అధికారుల కనుసైగల్లో అక్రమ మార్గంలో అనుమతులు పొందారని బాబా గౌడ్ ఆరోపిస్తున్నారు. స్థానికులు పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు అంటున్నారు.

## జీవో నెంబర్ 58, 59 పేరుతో భూముల దోపిడీ

తెలంగాణ ప్రభుత్వం గతంలో జారీ చేసిన జీవో నెంబర్ 58, 59 పేదలకు దాదాపు 200 గజాలలోపే ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి తీసుకొచ్చిన విధానం. కానీ కెసిఆర్ ప్రభుత్వంలో రాజకీయ నాయకులు అండదండతో అదే జీవోలను కొందరు భూకబ్జాదారులు తమకు అనుకూలంగా వాడుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించి తర్వాత జీవో 58, 59 కింద రెగ్యులరైజేషన్ పేరుతో నిబంధనలకు విరుద్ధంగా చట్టబద్ధం చేసుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విధానం వల్ల అసలు పేదలకు అందాల్సిన ప్రయోజనం కొంతమంది కబ్జారాయులకు చేరిందని స్థానికులు అంటున్నారు.

## ఎమ్మార్వో కార్యాలయంపై ఆరోపణలు

ఈ వ్యవహారంలో తుర్కయంజాల్ ఎమ్మార్వో కార్యాలయంపై కూడా తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన ఎమ్మార్వో, ఆర్డీవో, కలెక్టర్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.
స్థానికుల వివరాల ప్రకారం సర్వే నెంబర్ 212/1 భూమిపై జరుగుతున్న కబ్జా ప్రయత్నాల గురించి ఇప్పటికే ఎమ్మార్వో, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయానికి ఎన్నో ఫిర్యాదులు అందించామని అయితే రేరా, హెచ్ఎండిఏ అధికారులు ప్రభుత్వ స్థలానికి అపార్ట్మెంట్ల నిర్మాణాలకు అనుమతులు ఎలా ఇచ్చారని దీని వెనుక ఎంత భారి స్థాయిలో అవినీతి జరిగిందో ముఖ్యమంత్రి విచారణ చేయించాలని కోరుతున్నారు. అయినప్పటికీ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇప్పటి వరకు ఎలాంటి విచారణ కూడా చేయించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తుందని సామాజికవేత్త బాబా గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్, కొంతమంది అధికారులు కావాలనే ఆలస్యం చేస్తున్నారన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ భూముల విషయంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించడం తీవ్రమైన విషయం అని ప్రజలు అంటున్నారు.

## కలెక్టర్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు

మానేపల్లి రియాల్టీ అండ్ ఇన్ ఫ్రా వ్యవహారం పై స్థానికులు జిల్లా కలెక్టర్‌కు కూడా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసిన ప్రభుత్వ భూమిని కాపాడాలని, కబ్జా ప్రయత్నాలను వెంటనే అడ్డుకోవాలని అనుమతులు రద్దు చేయాలని కోరారు.
అయితే ఇప్పటి వరకు కలెక్టర్ కార్యాలయం నుంచి కూడా స్పష్టమైన స్పందన రాలేదని కలెక్టర్ స్పందించకపోవడం వెనుక రాజకీయ నాయకుల హస్తం ఉందా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఫిర్యాదు ఇచ్చి నెలలు గడుస్తున్నా అధికారులు స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ భూముల విషయంలో కలెక్టర్ స్థాయి అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కానీ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని దానిలో అంతర్యం ఏమిటో బహిర్గతం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## అధికారుల మౌనం వెనుక కారణాలేమిటి.?

తుర్కయంజాల్ ప్రాంతంలో జరుగుతున్న ప్రభుత్వ భూముల దోపిడీ వ్యవహారంపై అధికారుల మౌనం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు ప్రభుత్వ భూములపై అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. మరోవైపు కలెక్టర్, రెవిన్యూ అధికారులు మాత్రం స్పందించడం లేదు. ఇది సాధారణ నిర్లక్ష్యమా.? లేకపోతే అంతర్గత ఆర్థిక లావాదేవీలా.? అనే ప్రశ్నలు స్థానికుల్లో వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భూములు కబ్జా అయితే నష్టం చివరికి ప్రజలకే. అందుకే ఇలాంటి అంశాలలో అధికారులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

## కలెక్టర్ రెవిన్యూ అధికారుల తీరుపై స్థానికుల ఆందోళన

తుర్కయంజాల్ ప్రాంతానికి చెందిన పలువురు స్థానికులు జీవో నెంబర్ 58, 59 అంశంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూమిని కాపాడకపోతే భవిష్యత్తులో మరిన్ని కబ్జాలు జరిగే అవకాశం ఉందని వారు చెబుతున్నారు.
ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదులు చేసిన పత్రికలో కథనాలు వచ్చిన కలెక్టర్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం తమను నిరాశకు గురి చేసిందని స్థానికులు అంటున్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించాలని డిమాండ్

జీవే నెంబర్ 58, 59 ముసుగులో బీఆర్ఎస్ ప్రభుత్వంలో భారీ భూ కుంభకోణం జరిగిందని దీని పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ భూములను కాపాడాలని, కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వ భూములపై ఎలాంటి అక్రమాలు జరిగితే వాటిని సహించబోమని ప్రభుత్వం గతంలో పలుమార్లు ప్రకటించి హైడ్రా వంటి సంస్థలను సృష్టించి ప్రభుత్వ స్థలాలను కాపాడుతుంది. తుర్కయంజాల్ రెవిన్యూ కార్యాలయ పరిధిలో కోట్ల విలువైన భూమి కబ్జాకు గురై అపార్ట్మెంట్ల కట్టి వ్యాపారం చేస్తుంటే ఇప్పుడు అదే మాటలను అమలు చేయాల్సిన సమయం వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని స్థానికులు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని ప్రజలు కోరుతున్నారు.
సర్వే నెంబర్ 212/1 భూమి అసలు స్థితి ఏమిటి.? ఎవరు కబ్జా చేస్తున్నారు.? కలెక్టర్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు.? అన్న అంశాలపై స్పష్టత రావాలని వారు కోరుతున్నారు. విచారణలో ఎవరి పాత్ర ఉన్నా బయటపెట్టాలని, అవసరమైతే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ కలెక్టర్, రెవెన్యూ అధికారుల బాధ్యత, ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తి. వాటిని పరిరక్షించడం ప్రభుత్వం, కలెక్టర్ రెవిన్యూ అధికారుల బాధ్యత. ఎక్కడైనా కబ్జా ప్రయత్నాలు జరిగితే వెంటనే చర్యలు తీసుకోవాలి. తుర్కయంజాల్ ప్రాంతంలో జరుగుతున్న ఈ ఘటన కూడా అదే దిశగా ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వ భూములు కాపాడకపోతే భవిష్యత్తులో మరిన్ని సమస్యలు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు.

## కలెక్టర్ చర్యల కోసం ఎదురుచూపులు

ఇప్పుడు అందరి దృష్టి జిల్లా పరిపాలనపై పడింది. కలెక్టర్ నారాయణరెడ్డి ఈ వ్యవహారంపై స్పందించి తక్షణ చర్యలు తీసుకుంటారా.? ఎమ్మార్వో అధికారులు కబ్జాలను అడ్డుకుంటారా.? అన్నది చూడాలి. ప్రభుత్వ భూమిని కాపాడాలని స్థానికులు చేస్తున్న విజ్ఞప్తి పై అధికారులు స్పందిస్తారా.? లేక మౌనం కొనసాగిస్తారా.? అన్నది ఇప్పుడు కీలకంగా మారింది.

---

## ప్రభుత్వం పని చేసేది పేదల కోసం.. సంపన్నుల కోసం కాదు

### - కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** అమరావతిలో జరిగిన 6వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి, పాలనపై కీలక దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం కేవలం బిలియనీర్లు, ట్రిలియనీర్ల కోసం మాత్రమే కాదని, సామాన్య పేదల సంక్షేమం కోసమే పనిచేస్తోందనే విషయాన్ని అధికారులు ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని స్పష్టం చేశారు. మార్చి 23వ తేదీన రాష్ట్రంలో ప్రతిష్టాత్మకమైన ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేయబోతున్నట్లు ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు వెల్లడించారు.

### పాలనలో టెక్నాలజీ చేర్చాలి..

పాలనలో ఆధునిక సాంకేతికతను జోడించాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతూ, డేటా డ్రివెన్ గవర్నెన్స్ మరియు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగాన్ని పెంచాలని కలెక్టర్లను సీఎం చంద్రబాబు ఆదేశించారు. డిజిటల్ అక్షరాస్యతను పెంపొందించడం, 'మనమిత్ర' వాట్సప్ గవర్నెన్స్‌ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. 2028 మార్చి నాటికి రాయలసీమ స్టీల్

2లో..

---

## దానం, కడియంలకు భారీ ఊరట

### - మొత్తం 10 మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి అనర్హత పై స్పీకర్ తేల్చేసారు. సుదీర్ఘ కాలం సాగిన వాదనల తరువాత స్పీకర్ బుధవారం నిర్ణయం వెల్లడించారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ లో చేరిన వారి పైన అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేసారు.

2లో..

---

## సీఎంగానే భరించలేకపోతున్నాం, ఇక ప్రధాని అయితే దేశం గతేంటీ?

### - చంద్రబాబుపై జగన్ కామెంట్స్ వైరల్

2లో..



---

## బీఆర్ఎస్‌ను మించి గ్రౌండ్ పాలిటిక్స్‌లో కవిత దూకుడు



### క్యాడర్, లీడర్‌ను ఆకర్షిస్తారా?

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం ఒక అనూహ్య మార్పు కనిపిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ పార్టీ ప్రధాన నేతలు ఇంకా ప్రతిపక్ష పాత్ర పోషించడంలో కొంత తడబడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. తాము ఇంకా సమర్థవంతమైన ప్రతిపక్షంగా మారలేకపోతున్నాం అని గతంలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ పరిస్థితికి అద్దం పడుతున్నాయి. అయితే, సరిగ్గా ఇక్కడే కల్వకుంట్ల కవిత తనదైన శైలిలో రాజకీయ దూకుడు పెంచారు. బీఆర్ఎస్ పార్టీ కంటే వేగంగా ఆమె క్షేత్రస్థాయి సమస్యలపై స్పందిస్తూ, ప్రజల్లోకి దూసుకుపోతున్నారు.

### వెలుగుమట్ల బాధితుల కోసం అనూహ్య ఉద్యమం

ముఖ్యంగా ఖమ్మం జిల్లాలోని

2లో..

---

## లోక్‌సభ స్పీకర్‌పై వీగిపోయిన అవిశ్వాస తీర్మానం

### - కాంగ్రెస్ తన వాదన చెప్పగలిగిందా.?

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. సభలో స్పీకర్ పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ ప్రతిపక్షాలు తొలి విడత బడ్జెట్ సమావేశాల చివరలో అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై మంగళవారం నుంచి సుదీర్ఘంగా చర్చ జరగ్గా బుధవారం ఓటింగ్ నిర్వహించారు. మూజువాణి ఓటులో అభిశంసన వీడిపోవడంతో స్పీకర్ ఓం బిర్లా గురువారం నుంచి సభకు హాజరుకానున్నారు. ఇక, చర్చలో విపక్షాల విమర్శలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పై ఆయన విమర్శలు గుప్పించారు. మొదటి విడత బడ్జెట్ సమావేశాల చివరిలో స్పీకర్



2లో..

---

## స్పీకర్ తీర్పు ప్రజాస్వామ్యంపై బహిరంగ దాడి

### - దానం, కడియంకు క్లీన్ చిట్ పై కేటీఆర్ ఫైర్

2లో..



### బీఆర్ఎస్‌ను మించి గ్రౌండ్ పాలిటిక్స్‌లో

# కవిత దూకుడు

వెలుగుమట్ల గ్రామంలో పేదల ఇళ్ల కూల్చివేతపై కవిత చేసిన పోరాటం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు కారణమవుతోంది. నిరాశ్రయులైన కుటుంబాల కోసం ఆమె ఏకంగా ఖమ్మం నడిబొడ్డున అమరణ నిరాహార దీక్షకు దిగడం, పోలీసుల నిర్బంధాన్ని సైతం లెక్కచేయకుండా పోరాడటం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బీఆర్ఎస్ కేడర్ అంతా స్తబ్ధుగా ఉన్న తరుణంలో, ఆమె నేరుగా గ్రౌండ్ లెవల్‌లోకి వెళ్లి బాధితులకు భరోసా ఇవ్వడం ద్వారా అటు పార్టీ శ్రేణుల్లో, ఇటు ప్రజల్లో ఆమెపై సానుభూతి , మద్దతు పెరుగడానికి కారణం అయింది.

### లిక్కర్ కేసు నుంచి విముక్తి

ఇటీవలే ఢిల్లీ లిక్కర్ కేసు నుండి విముక్తి పొందిన కవిత తెలంగాణ జాగృతి వేదికగా తన రాజకీయ పునరాగమనాన్ని అత్యంత శక్తివంతంగా చాటుకుంటున్నారు. తనను పార్టీ నుండి పంపేశారని చెబుతున్న ఆమె చేస్తున్న పోరాటాలు చూస్తుంటే బీఆర్ఎస్ చేయలేని పనిని ఆమె ఒంటిచేత్తో చేస్తున్నట్లు కనిపిస్తోంది. కేసీఆర్, కేటీఆర్ వంటి అగ్రనేతలు ఇంకా వ్యూహాల్లో నిమగ్నమై ఉండగా, కవిత మాత్రం నేరుగా యాక్షన్ లోకి దిగడం బీఆర్ఎస్‌కు షాక్ లాంటిదే. కవిత ఇప్పుడు తన 'తెలంగాణ ఉద్యమ కాలం' నాటి పంథాను మళ్లీ ఎంచుకున్నారు. అప్పట్లో జాగృతి ద్వారా ఎలాగైతే ప్రజలను సమీకరించారో, ఇప్పుడు కూడా అదే ఫార్ములాతో వెళ్తున్నారు. చట్టసభల్లో గొంతుక కంటే వీధుల్లో చేసే పోరాటమే బలంగా వినిపిస్తుంది అనే సిద్ధాంతాన్ని ఆమె పాటిస్తున్నారు.

### బీఆర్ఎస్ లీడర్, క్యాడర్ జాగృతి వైపు ఆకర్షితులవుతారా?

జగదీష్ రెడ్డి చెప్పినట్లుగా పార్టీ ఇంకా ప్రతిపక్ష పాత్రకు అలవాటు పడకపోవచ్చు కానీ, కవిత మాత్రం ఇప్పటికే ఆ పాత్రలో ఒదిగిపోయారు. ప్రజా సమస్యలపై ఆమె చూపిస్తున్న ఈ తెగువ, కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలు ఆమెకు ప్రజల మద్దతును మరింత పెంచుతున్నాయి. భవిష్యత్తులో బీఆర్ఎస్ కేడర్ కూడా ఆమె నాయకత్వం వైపు మొగ్గు చూపినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. కేటీఆర్ కూడా వెంటనే ప్రెస్ మీట్లు, సోషల్ మీడియా విమర్శలకే పరిమితం కాకుండా ప్రత్యక్షంగా రాజకీయ యుద్ధాలకు దిగాలన్న అభిప్రాయం బీఆర్ఎస్ క్యాడర్ లో వినిపిస్తోంది.

## లోక్‌సభ స్పీకర్‌పై వీగిపోయిన అవిశ్వాస తీర్మానం

అభిశంసనకు కాంగ్రెస్ పార్టీ నోటీసు ఇవ్వగా 118 మంది ఎంపీలు సంతకాలు చేశారు.ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై అమిత్ షా చేసిన విమర్శలకు ప్రతిపక్ష సభ్యుల నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తమయ్యాయి. అమిత్'అన్ పార్లమెంటరీ' లాంగ్వేజ్‌ను ఉపయోగించారని ఆరోపించారు. "వారు ప్రవర్తన గురించి మాట్లాడుతున్నారు. వారి నాయకుడు స్వయంగా కన్నుగీటి, దగ్గరకు వెళ్లి ప్రధాన మంత్రిని కౌగిలించుకుని, ఫ్లయింగ్ కిస్ ఇచ్చినప్పుడు అది రొచ్చుగొట్టడం కాదా?" అని షా అన్నారు. దీనిపై హోం మంత్రి క్షమాపణ చెప్పాలని విపక్ష సభ్యులు డిమాండ్ చేయడంతో సభలో గందరగోళం నెలకుంది. తన వ్యాఖ్యల్లో అభ్యంతరకరమైన పదాలు ఉంటే రికార్డుల నుంచి తొలగించాలని అమిత్ షా కోరారు.

స్పీకర్ అంకితభావాన్ని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయని, వారు నిబంధనలు ఉల్లంఘిస్తేనే సభాపతి రంగంలోకి దిగారని అమిత్ షా మండిపడ్డారు. మొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ హయాంలోనే పార్లమెంట్ నిబంధనలు రూపొందించారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ రూపొందించిన ఈ నిబంధనలపై తాము చర్చకు సిద్ధమని, పార్టీలకు అతీతంగా సభాపతి వ్యవహరిస్తారని పేర్కొన్నారు.ప్రతిపక్షాలు తమకు సంఖ్యాబలం లేకున్నా స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చారు. ఎన్డీయేకు 293 (బీజేపీ 240, టీడీపీ 16, జేడీయూ 12, ఇతరులు), ఇండియా కూటమికి 238 (కాంగ్రెస్ 99, సమాజ్‌వాదీ పార్టీ 36, డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్, ఇతరులు) సభ్యులు ఉన్నారు. స్వాతంత్ర్య భారత చరిత్రలో ఇప్పటి వరకూ ముగ్గురు స్పీకర్లు మాత్రమే అభిశంసన ఎదుర్కొన్నారు. లోక్‌సభ మొదటి స్పీకర్ జీవీ మౌలాంకర్, 1987లో బలరామ్ జాకడ్, 2026లో ఓం బిర్లా.

## ప్రభుత్వం పని చేసేది పేదల కోసం.. సంపన్నుల కోసం కాదు

ప్లాంట్ పనులను పూర్తి చేయడమే లక్ష్యమని, కొప్పర్తి, ఓర్వకల్లు వంటి ప్రాంతాలను పారిశ్రామిక క్లస్టర్లుగా తీర్చిదిద్దాలని చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ఎంఈలను ఏర్పాటు చేయడం ద్వారా స్థానిక ఉపాధిని మెరుగుపరుస్తామని తెలిపారు.

### వాటి ధరలు పడిపోతున్నాయని ఆందోళన

అంతర్జాతీయ పరిణామాలపైనా సీఎం చంద్రబాబు స్పందిస్తూ ఇరాన్ యుద్ధ ప్రభావం వల్ల రాష్ట్రంలోని అరటి, గుడ్ల వంటి ఉత్పత్తుల ధరలు పడిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటికి ప్రత్యామ్నాయ మార్కెట్లను వెతకాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా సంఘాల ఉత్పత్తులకు సొంత బ్రాండింగ్ కల్పించి మార్కెటింగ్ చేయాలని సూచించారు. 2047 నాటికి ప్రతి ఒక్కరి తలసరి ఆదాయం రూ. 55 లక్షలకు చేరుకోవాలనే విజన్‌తో పనిచేయాలని, ముఖ్యంగా పీ4 విధానాన్ని గేమ్ ఛేంజర్‌గా మలిచే బాధ్యత కలెక్టర్లు తీసుకోవాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

### కలెక్టర్లు ఇక క్షేత్ర స్థాయిలో ఉండాల్సిందే

సంక్షేమం – డెవలప్‌మెంట్, గుడ్ గవర్నెన్స్ బ్యాలన్సింగ్ చాలా అవసరమని చెప్పారు. అదే విధంగా వర్చువల్, ఫిజికల్ వర్కింగ్ ఈరోజు రియాలిటీగా మారుతోందని సీఎం అన్నారు. 'పర్వ లేదు' అనే ఉదాసీనత కూడా చేయాల్సిన పనులపై ప్రభావం చూపుతాయని తెలిపారు. గతంలో విజన్ 2020 పెట్టినప్పుడు చాలామంది విమర్శించారని ఇప్పుడు అది ఫలితాన్ని ఇవ్వడంతో 2047వైపు అందరూ చూస్తున్నారని సీఎం అన్నారు. ఈసారి 15 పాయింట్లను ఈ ఏడాది లక్ష్యాల కింద ఇస్తున్నట్లు చెప్పారు. 20 నెలల్లో సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశామని అన్నారు.

ఏ సంక్షేమ కార్యక్రమం ఎప్పుడు చేస్తామో ముందే చెబుతామని దానికి తగ్గ ప్రణాళికలు వేసుకోవాలని సూచించారు. ఈ నెలలో 13వ 'అన్నదాత సుఖీభవ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు సీఎం. ఖరీఫ్‌కు ఇప్పటి నుంచే ప్రిపరేటరీ వర్క్ చేయాలని సీఎం సూచించారు. విద్యుత్ చార్జీలను 39 పైసలు తగ్గిస్తున్నామని తద్వరా వినియోగదారులపై భారం భారీగా తగ్గనుందని వెల్లడించారు. 6 లక్షల సోలార్ రూఫ్ టాప్‌లు ఏర్పాటు చేయాలనేది టార్గెట్‌గా పెట్టుకున్నామని సీఎం చంద్రబాబు వివరించారు.

### స్పీకర్ తీర్పు ప్రజాస్వామ్యంపై

# బహిరంగ దాడి

**– దానం, కడియంకు క్లీన్ చిట్ పై కేటీఆర్ ఫైర్**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిల అనర్హత పిటిషన్లను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కొట్టివేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్పీకర్ తీసుకున్న ఈ నిర్ణయం ప్రజాస్వామ్యంపై జరిగిన బహిరంగ దాడి అని ఆయన అభివర్ణించారు.

కాంగ్రెస్ పార్టీ బీ–ఫామ్ మీద ఎంపీగా పోటీ చేసిన వ్యక్తి (దానం నాగేందర్)కి కూడా క్లీన్ చిట్ ఇవ్వడం అంటే ప్రజల తీర్పును నిస్సిగ్గుగా అవమానించడమేనని కేటీఆర్ మండిపడ్డారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ స్పీకర్ గడ్డం ప్రసాద్ తీసుకున్న ఈ నిర్ణయం ప్రజాస్వామ్య చరిత్రలో ఒక చీకటి రోజు అని కేటీఆర్ విమర్శించారు.

రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలను అధికారంలో ఉన్నవారికి అనుకూలంగా వాడుకోవడానికి ఇది ఒక నిదర్శనమని ఆయన ఆరోపించారు. ప్రజల ఓట్లతో గెలిచిన పదవులను వ్యక్తిగత లాభాల కోసం మార్చుకుంటుంటే, దానికి స్పీకర్ తన ముద్ర వేయడం వల్ల ప్రజాస్వామ్య విలువలకే ముప్పు వాటిల్లుతుందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి నిర్ణయాలు వ్యవస్థలపై ప్రజలకున్న విశ్వాసాన్ని పూర్తిగా దెబ్బతీస్తాయని కేటీఆర్ హెచ్చరించారు. తెలంగాణ ప్రజలు ఈ పరిణామాలన్నింటినీ నిశితంగా గమనిస్తున్నారని, ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న వారికి సరైన సమయంలో తగిన బుద్ధి చెబుతారని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో తన నిరసనను వ్యక్తం చేశారు.

## దానం, కడియంలకు భారీ ఊరట

స్పీకర్ నిర్ణయం ఆలస్యం కావటంతో త్వరగా తేల్చేలా ఆదేశాలు ఇవ్వాలని బీఆర్ఎస్ సుప్రీంను ఆశ్రయించింది. ఫలితంగా సుప్రీం సూచనల మేరకు స్పీకర్ విచారణ పూర్తి చేసారు. ఈ ఇద్దరి విషయంలో ఇప్పుడు స్పీకర్ తీసుకున్న నిర్ణయం సంచలనంగా మారుతోంది. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి అనర్హత పిటీషన్ల పైన స్పీకర్ తన నిర్ణయం ఎట్ట కేలకు ప్రకటించారు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో, నిర్ణీత గడువు ముగుస్తుండటంతో స్పీకర్ కార్యాలయం ఈ మేరకు నిర్ణయం ప్రకటించింది. మొత్తం పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించినట్లు ఆరోపణలు ఎదుర్కోగా, వారిని విచారించిన స్పీకర్ గడ్డం ప్రసాద్, ఇప్పటికే ఎనిమిది మందికి క్లీన్‌చిట్ ఇచ్చిన ఇచ్చారు. కాగా ఇక దానం, కడియంల విషయంలో వాదనలు పూర్తయ్యాయి. సుప్రీంకోర్టు సూచనల ప్రకారం మార్చి 12వ తేదీలోపు వీరిద్దరి విషయంలో స్పీకర్ నిర్ణయాన్ని ప్రకటించాల్సివుంది. గత లోక్ సభ ఎన్నికల్లో కడియం శ్రీహరి కూతురు కడియం కావ్య వరంగల్ ఎంపీగా పోటీ చేసి గెలుపొందారు. ఆమె ఎన్నికల ప్రచారంలో కడియం అంతా తానై వ్యవహరించారు. అంతేకాదు కూతురు గెలుపు కోసం తన వంతుగా కృషి చేశారు. మరోవైపు దానం నాగేందర్ ఏకంగా సికింద్రాబాద్ ఎంపీగా కాంగ్రెస్ పార్టీ టికెట్ పోటీ చేసారు. దీంతో, ఈ ఇద్దరి విషయంలో స్పీకర్ నిర్ణయం ఏంటనేది ఉత్కంఠ పెంచింది.

### సుప్రీంలో విచారణ వేళ స్పీకర్ నిర్ణయం

ఈ ఇద్దరిని విచారణ చేసిన స్పీకర్ ఇప్పుడు నిర్ణయం వెల్లడించారు. ఈ ఇద్దరి పైన దాఖలైన అనర్హత పిటీషన్లను డిస్మిస్ చేసారు. ఈ ఇద్దరి పైనా అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్, బీజేపీ వేసిన పిటీషన్లను కొట్టి వేసారు. నేడు సుప్రీంలో అనర్హత పిటీషన్ల పైన విచారణ వేళ స్పీకర్ గురువారం నిర్ణయం ప్రకటించారు. ఇప్పుడు స్పీకర్ వీరి అనర్హత పిటీషన్లు కొట్టి వేయటంతో ఈ ఇద్దరికి బిగ్ రిలీఫ్ గానే భావించాలి. ఈ ఇద్దరూ పార్టీ ఫిరాయించినట్లు ఎక్కడా ఆధారాలు లేవని పేర్కొన్నట్లు సమాచారం. దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డిలు పిటిషన్ వేశారు. స్టేషన్ ఘన్‌పూర్ నుంచి కారు గుర్తుతో పోటీచేసిన కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో చేరడాన్ని ప్రశ్నిస్తూ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ అనర్హత పిటిషన్ ఫైల్ చేశారు. వీటిని విచారణ చేసిన స్పీకర్ ఇప్పుడు ఈ ఇద్దరికీ రిలీఫ్ ఇస్తూ అనర్హత పిటీషన్లను డిస్మిస్ చేసారు.

## సీఎంగానే భరించలేకపోతున్నాం, ఇక ప్రధాని అయితే దేశం గతేంటీ?

**– చంద్రబాబుపై జగన్ కామెంట్స్ వైరల్**

అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు కొత్త స్థాయికి చేరుకున్నాయి. గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో కొన్ని ప్రధాన మీడియా సంస్థల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జాతీయ రాజకీయాల్లోకి వెళ్తారని, ఆయనకు ఉప ప్రధాని పదవి దక్కబోతోందని ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ ప్రచారంపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్ మోహన్ టడ్డి తనదైన శైలిలో సెటైర్లు వేశారు. బుధవారం తాడేపల్లిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన అనేక ఆసక్తికర అంశాలు ప్రస్తావించారు.

### చంద్రబాబు నేషనల్ ప్లాన్స్ - జగన్ సెటైర్లు

చంద్రబాబు నాయుడు త్వరలో దేశానికి ఉప ప్రధాని కాబోతున్నారంటూ కొన్ని మిడియా సంస్థలు (జగన్ భాషలో ఎల్లో మీడియా) చేస్తున్న హడావుడిపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు జగన్ నవ్వుతూ సమాధానమిచ్చారు. చంద్రబాబును ఇక్కడ ముఖ్యమంత్రిగానే ప్రజలు భరించలేకపోతున్నారు. అలాంటిది ఆయన ఉ ప్రధానమంత్రి అయితే దేశ ప్రజలు ఎలా భరిస్తారు? అంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని, కనీసం ఇక్కడ సరిగా పాలన సాగించలేని వ్యక్తి దేశ స్థాయికి వెళ్తే పరిస్థితి ఏంటన్నట్టు ఆయన కామెంట్స్ చేశారు. గతంలో కూడా చంద్రబాబు జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలని చూశారని, కానీ ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో అదంతా మీడియా సృష్టిస్తున్న భ్రమ మాత్రమే అని జగన్ అభిప్రాయపడ్డారు. మీడియాలో వస్తున్న కథనాలను ఆయన తప్పుపట్టారు. బాబును ఆకాశానికి ఎత్తే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

### పవన్ వ్యాఖ్యలకు జగన్ కౌంటర్

ఏపీ అసెంబ్లీలో చోటు చేసుకున్న పరిణామాలపై కూడా జగన్ స్పందించారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... వైఎస్ఆర్ సీపీకి ఉన్నది కేవలం 11 మంది సభ్యులే అయినా వారు 1100 మందిలా మాట్లాడుతున్నారని అంటూ కామెంట్ చేశారు. ఈ విషయంపై కూడా మీడియా ప్రతినిధులు జగన్‌ను ప్రశ్నించారు. దీనికి ఆయన పాజిటివ్‌గా తీసుకున్నారు. " మా పార్టీ ప్రతినిధులు అంత నిబద్ధతతో పని చేస్తున్నారు. అది నిజంగా మంచి విషయమే కదా" అని బదులిచ్చారు. కేవలం 11 మంది సభ్యులతోనే ప్రభుత్వం అంతలా భయపడుతోందంటే తమ పార్టీ నేతల గొంతుక ఎంతలా పోరాడుతుందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. పవన్ చేసిన వ్యాఖ్యలు తమ సభ్యుల పోరాట పటిమకు నిదర్శనమని, ప్రజల సమస్యల కోసం తాము ఎంత తక్కువ మంది ఉన్నా గట్టిగా పోరాడతామని జగన్ స్పష్టం చేశారు.

### మహిళలకు రక్షణ లేదు

రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల గురించి జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల జోలికి వస్తే తాట తీస్తానని చెప్పిన చంద్రబాబు ఆచరణలో చూపడం లేదని విమర్శించారు. వీడియోలతో దొరికిపోయిన ఎమ్మెల్యే, టీటీడీ ఛైర్మన్‌పై ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. మంత్రులు, ఎమ్మెల్యేల మాత్రమే కాదు, కనీసం తప్పు చేసిన పీఏలపై కూడా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు.

### డైవర్షన్ కోసం చంద్రబాబు తాపత్రయం

చంద్రబాబు నాయుడు ఇటీవల ప్రతి జంట ముగ్గురు, నలుగురు పిల్లలను కనాలని చేసిన కామెంట్స్‌పై కూడా జగన్ మండిపడ్డారు. ఇదంతా డైవర్షన్ పాలిటిక్స్ అని కొట్టిపారేశారు. ఎన్నికల ముందు చంద్రన్న పెళ్లికానుక కింద లక్ష రూపాయలు ఇస్తానని చెప్పి ఇప్పటి వరకు ఒక్క జంటకైనా డబ్బులు ఇచ్చారా అని ప్రశ్నించారు. తన హామీలను నెరవేర్చకుండా ఇప్పుడు కొత్తగా ముగ్గురు పిల్లల గురించి మాట్లాడటం ప్రజలను మోసం చేయడమేనన్నారు.

## రిమాండ్ ఖైదీ బద్వేల్ జడ్పిటిసి చిన్న పోలిరెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్సీ గోవింద రెడ్డి వైకాపా నాయకులు

**బద్వేలు** బద్వేల్ సబ్ జైలులో రిమాండ్ లో ఉన్న జడ్పిటిసి వంకల చిన్న పోల్ రెడ్డి ని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి మంగళవారం పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై రాజకీయ కక్ష సాధింపు చర్యలు పెరిగిపోయాయని ఆక్షేపించారు. ఒక కేసు తర్వాత మరో కేసు నమోదు చేస్తూ పార్టీ నాయకులను ఇబ్బంది పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇలాంటి వేధింపులు కొనసాగడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ఎన్నికల ముందు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ "రెడ్ బుక్"లో వైఎస్ఆర్సీపీ నాయకుల పేర్లు నమోదు చేసుకున్నామని చెప్పినట్టుగా ఇప్పుడు అదే విధానాన్ని అమలు చేస్తూ ముఖ్యమంత్రి , మంత్రి లోకేష్ రాజకీయ కక్షతో వ్యవహరిస్తున్నారని విమర్శించారు.×బద్వేల్ నియోజకవర్గంలో కూడా స్థానిక కూటమి నాయకుల ప్రోత్సాహంతో వైఎస్ఆర్సీపీ నాయకులను లక్ష్యంగా చేసుకుని తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆయన ఆరోపించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాజకీయంగా బలహీనపరచాలనే ఉద్దేశంతోనే ఈ చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. జడ్పిటిసి పోల్ రెడ్డి పై నమోదైన కేసు కూడా ఇదే కుట్రలో భాగమని ఆయన అన్నారు. 2011లో జరిగిన సొసైటీ వ్యవహారంపై అప్పట్లోనే విచారణలు పూర్తై డబ్బులు కూడా తిరిగి చెల్లించి నప్పిటికి దాదాపు 14 సంవత్సరాల తర్వాత అదే అంశాన్ని మళ్లీ తీసుకుని కేసు నమోదు చేయడం పూర్తిగా అన్యాయమని చెప్పారు. 2009–2014,2014?2019, 2019?2024 వరకు మూడు ప్రభుత్వాలు మారినా ఇప్పుడు మళ్లి ఈ కేసును తెరపైకి తీసుకురావడం వెనుక రాజకీయ దురుద్దేశ్యాలే ఉన్నాయని విమర్శించారు.ఒక ప్రజాప్రతినిధి అయిన చిన్న పోల్ రెడ్డి కి కనీసం నోటీసు ఇవ్వకుండా నేరుగా అరెస్టు చేసి జైలుకుతీ పంపడం ప్రజాస్వామ్య వ్యవస్థకు విరుద్ధమని వైఎస్ఆర్సీపీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కూటమి నాయకులు వారి కుటుంబాలకు సంబంధించిన అనేక అక్రమాల గురించి పత్రికలు, ప్రచార మాధ్యమాల్లో వార్తలు వస్తున్నాయని, ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని అన్నారు. భవిష్యత్తులో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇలాంటి అన్యాయాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పకుండా తీసుకుంటామని పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా జడ్పిటిసి వంకల చిన్న పోల్ రెడ్డి త్వరలోనే బయటకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తూ, వైఎస్ఆర్సీపీ నాయకులు అందరూ ఐక్యంగా నిలబడి పోరాటం కొనసాగిస్తామని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తెలిపారు.×ఈ కార్యక్రమం మున్సిపల్ ఛైర్మన్ రాజగోపాల్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు మల్లేశ్వర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర జిల్లా అనుబంధ విభాగాల నాయకులు పార్టీ సీనియర్ నాయకులు వంకల పెద్ద పోలిరెడ్డి, యద్దారెడ్డి, పుత్తా శ్రీరాములు, బిజివేముల రామసుబ్బారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, ఎంఆర్ఎఫ్ టైర్స్ రమణారెడ్డి, రమేష్ బాబు, వెంకటసుబ్బారెడ్డి, చెన్న కృష్ణారెడ్డి, కేశవరెడ్డి, వీరారెడ్డి, జయరాం రెడ్డి, ఓబుల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

### తెలంగాణ గవర్నర్గా

# శివప్రతాప్ శుక్లా ప్రమాణం

**– శుక్లాతో ప్రమాణం చేయించిన హైకోర్టు సీజే ఏకే సింగ్**
**– ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన సీఎం, మంత్రులు, ప్రముఖులు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్ర గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా ఇవాళ ప్రమాణ స్వీకారం చేశారు. ఉదయం 11.30 నిమిషాలకు లోక్‌భవన్‌లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎకే సింగ్ కొత్త గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో ప్రమాణం చేయించారు. రాష్ట్ర గవర్నర్గా శివప్రతాప్ శుక్లా తెలుగులో ప్రమాణం చేయడం విశేషం. గవర్నర్ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ప్రముఖులు హాజరయ్యారు. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ జిల్లా రుద్రాపూర్‌లో 1952 ఏప్రిల్ 1న జన్మించిన శివప్రతాప్ శుక్లా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, యూపీ మంత్రిగా, రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా పనిచేశారు. ఇప్పటి వరకు హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్‌గా చేసిన శివప్రతాప్ శుక్లా తెలంగాణ గవర్నర్‌గా నియమితులయ్యారు.యూపీలో మొదటిసారి కల్యాణ్‌సింగ్ నేతృత్వంలో ఏర్పడిన బీజేపీ ప్రభుత్వంలో విద్యాశాఖ సహాయమంత్రిగా స్వతంత్ర హోదాలో పని చేశారు. నాలుగు సార్లు 1993, 1996లలో ఎమ్మెల్యేగా ఎన్నికై విధులు నిర్వహించారు. 1996లో కల్యాణ్‌సింగ్, రామ్‌ప్రకాశ్ గుప్తా, రాజనాథ్ల ప్రభుత్వాల్లో మంత్రిగా పని చేశారు. 20 ఏళ్ల తర్వాత 2016 జూన్ 10వ తేదీన యూపీ రాష్ట్రం నుంచి రాజ్యసభకు ఎంపికయ్యారు. కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రిగా మోదీ ప్రభుత్వంలో బాధ్యతలు తీసుకున్నారు. అలా ఎనిమిదేళ్లపాటు 2022 జులై 5 వరకు రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. మూడేళ్ల కిందట 2023 ఫిబ్రవరి 18న హిమాచల్ప్రదేశ్ గవర్నర్గా నియమితులయ్యారు. ఇప్పుడు తెలంగాణకు బదిలీ అయ్యారు.

## హరీష్ రాణా కారుణ్య మరణానికి సుప్రీంకోర్టు అనుమతి

**– తీర్పు వెల్లడిస్తూ జడ్జి కన్నీళ్లు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రమాదవశాత్తూ భవనంపై నుంచి కిందపడి తలకు తీవ్రగాయమై దాదాపు 13 ఏళ్లుగా మంచానికే పరిమితమైన ఓ యువకుడి కారుణ్య మరణం కేసులో సర్వోన్నత న్యాయస్థానం చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. జీవచ్ఛవంలా మారిన అతడికి చికిత్సకు నిలిపివేసి, కారుణ్య మరణానికి అనుమతి ఇచ్చింది. కోమాలో ఉన్న ఓ వ్యక్తికి కారుణ్య మరణం ప్రసాదించడం దేశంలో ఇదే తొలిసారి. ఢిల్లీకి చెందిన హరీష్ రాణా కారుణ్య మరణానికి అనుమతించాలని కోరుతూ అతడి తల్లిదండ్రులు దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు బుధవారం ఈ మేరకు తీర్పు వెలువరించింది.వివరాల్లోకి వెళ్తే ఢిల్లీకి చెందిన హరీష్ రాణా 2013 ఆగస్టు 20న చండీగఢ్‌లోని పంజాబ్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చదువుతున్న సమయంలో ప్రమాదానికి గురయ్యాడు. అతడు ఉంటోన్న పీజీ నాలుగో ఫ్లోర్ బాల్కనీ నుంచి ప్రమాదవశాత్తూ కిందపడ్డాడు. ఈ ఘటనలో అతడి తలకు తీవ్ర గాయం కాగా శరీరం కదలలేని స్థితికి చేరుకుంది. హరీష్ తల్లిదండ్రులు తమ కుమారుడ్ని వైద్యం కోసం ప్రముఖ ఆసుపత్రులు చుట్టూ తిప్పినా ఫలితం లేకపోయింది. అప్పటి నుంచి కోమాలోనే ఉన్న అతడ్ని తల్లిదండ్రులు కంటికి రెప్పలా చూసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆర్థికంగా, మానసికంగా చితికిపోయిన వారు ఈ నరకం నుంచి తమ కుమారుడికి విముక్తి కల్పించాలని కోరుతూ 2024లో ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు.ఈ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు వారి అభ్యర్థనను తోసిపుచ్చింది. అనంతరం సుప్రీంకోర్టుకు వెళ్లినా ఆ తల్లిదండ్రులకు నిరాశ తప్పలేదు. అయితే, హరీష్ కోలుకునే అవకాశం లేదని మెడికల్ బోర్డ్ నివేదికలు ఇవ్వడంతో మరోసారి సుప్రీం తలుపు తట్టారు. వైద్యుల నివేదికలను పరిశీలించిన అత్యున్నత న్యాయస్థానం పిటిషన్ విచారణకు అనుమతించింది. ఈ క్రమంలోనే జనవరి 13న హరీష్ రాణా తల్లిదండ్రులతో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. మానవీయకోణంలో తమ కుమారుడికి గౌరవప్రమదమైన మరణాన్ని ప్రసాదించాలని వారు వేడుకున్నారు.ఆ సందర్భంగా లైఫ్ సపోర్ట్ చికిత్సను ఉపసంహరించే అంశాన్ని మాత్రం తాము పరిశీలిస్తామంటూ జస్టిస్ జేబీ వార్దీవాలా, జస్టిస్ కేవీ విశ్వనాథ్‌ల ధర్మాసనం తీర్పు రిజర్వ్ చేసింది. తాజాగా తీర్పును వెలువరించిన కోర్టు అతడి కారుణ్య మరణానికి అనుమతి ఇచ్చింది. "గత 13 ఏళ్లుగా కోమాలో ఉన్న అతడిలో ఎలాంటి మెరుగుదల కనిపించలేదని వైద్య నివేదికలు చెబుతున్నాయి రోగిని కాపాడటమే డాక్టర్ విధి. కానీ, అతడు కోలుకునే అవకాశం లేనప్పుడు ఆ విధి నిర్వర్తించడం నిష్ప్రయోజనం అవుతుంది. అతడి గౌరవానికి ఎలాంటి భంగం కలగకుండా లైఫ్ సపోర్ట్ చికిత్సను నిలివేసే బాధ్యత ఎయిమ్స్ చూసుకుంటుంది. ఒకరిని ప్రేమించడం కంటే కష్టకాలంలో వారికి తోడుగా ఉండటమే. హరీష్ రాణా కుటుంబం ఎప్పుడూ అతడి వెంటే ఉంది. జీవితం, ప్రేమ, నష్టం వీటిని పక్కనపెడితే వాస్తవాల ఆధారంగా ఈ కఠిన నిర్ణయం తీసుకున్నాం" అని ధర్మాసనం పేర్కొంది."జీవితాన్ని అంగీకరిస్తున్నారా? అని ఏ మనిషీని దేవుళ్లు అడగరు.. అది నువ్వే తీసుకోవాలి" అని కారుణ్య మరణాన్ని ఓ ఎంచుకోవచ్చా అని కోర్టులు అడిగినప్పుడు (అమెరికా మంత్రి) హెన్రీ (వార్డ్ బీచర్) చెప్పిన మాటలు ఇవి" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. విలియం షేక్‌స్పియర్ హామ్లెట్ నవలలోని 'ఉండాలా? వద్దా?' అనే పదబంధాన్ని ఉటంకిస్తూ 'చనిపోయే హక్కు'ను నిర్ణయించడానికి దీనిని ఉపయోగిస్తున్నారని జస్టిస్ జేబీ పార్దీవాలా అన్నారు. 2011లో అరుణ షాన్‌బాగ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో అసాధారణ పరిస్థితులలో దేశంలో కారుణ్య మరణాన్ని చట్టబద్ధం చేశారు. లైంగిక దాడి గురైన ఆమె పక్షవాతంతో నాలుగు దశాబ్దాలకు పైగా కోమాలోనే ఉండిపోయారు. ఆమె కోలుకుంటారనే ఆశలేదని వైద్య నివేదికలు పేర్కొనడంతో కారుణ్య మరణానికి అనుమతించాలని కుటుంబసభ్యులు దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. అయితే, ఈ తీర్పు అసాధారణ సందర్భాలలో కారుణ్య మరణానికి నిబంధనలను సడలించి, దీనిని అనుమతించింది.

## కార్మికుల సమస్యలపై పోరాటం చేయాలి

**రంగారెడ్డి** పారిశ్రామిక అభివృద్ధితోపాటు... కర్షకుల బాగోగులు చూసినప్పుడే రాష్ట్రం, దేశాభివృద్ధి జరుగుతుందని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం నాడు కందుకూరుకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు గాదె కుమార్ కు మండల ఐఎన్టీయూసీ కార్మిక శాఖ విభాగం అధ్యక్షుల నియామక పత్రాన్ని ఆయన అందజేశారు.మహేశ్వరం నియోజకవర్గం ఐఎన్టీయూసీ అధ్యక్షులు నడికుడి శివ ఆధ్వర్యంలో తుక్కుగూడ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కేఎల్ఆర్ మాట్లాడారు.కేంద్రం రూపొందించిన కొత్త చట్టాలతో కార్మికుల భద్రత, ప్రాణ, ఆరోగ్యానికి రక్షణ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల చట్టాలు, రక్షణపై అవగాహన పెంచుకోవాలని నూతనంగా ఎన్నికైన ఐఎన్టీయూసీ నాయకులకు లక్ష్మారెడ్డి సూచించారు.ఈ కార్యక్రమంలో మహేశ్వరం, కందుకూరు మండలాల నాయకులు పాల్గొన్నారు.

# తూడి రమ - లచ్చన్న సేవాభావం ఆదర్శనీయం

- టీఎల్ యువసేన సభ్యులు
- టీఎల్ యువసేన సభ్యుల సమక్షంలో ఘనంగా తూడి రమ - లచ్చన్న జన్మదిన వేడుకలు



గంగాధర (ప్రశ్న న్యూస్) కరీంనగర్ జిల్లా, గంగాధర మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక వేత్త, టీఎల్ యువసేన అధినేత తూడి లచ్చన్న సతీమణి రమ జన్మదిన వేడుకలను టీఎల్ యువసేన సభ్యుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎల్ యువసేన సభ్యులు మాట్లాడుతూ రమ సేవాభావంతో, సరళ స్వభావంతో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. సమాజ సేవలో తూడి లచ్చన్నకు ఆమె ఎప్పుడూ అండగా నిలుస్తూ, ప్రజలకు సేవ చేయాలనే తపనతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. రమ - లచ్చన్న దంపతులు ఆయురారోగ్యాలతో, సంతోషంగా జీవించాలని,ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ ఆమెకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కేక్ కట్ చేసి రమ-లచ్చన్నను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎల్ యువసేన సభ్యులు, గ్రామ పెద్దలు,అభిమానులు,తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ మండపాల నిర్మాణం కొరకు శంకుస్థాపన చేసిన: ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

దొండపర్తి వద్ద ఒక కోటి 28 లక్షల రూపాయలతో కళ్యాణ మండపం నిర్మాణం

ఐ ఎస్ బి నగర్ వద్ద 34 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం

మధురానగర్ వద్ద 32 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం

స్థానిక కార్పొరేటర్ వీరారావు(బుజ్జి) కూటమి నాయకులతో ప్రారంభించిన ఎమ్మెల్యే

నియోజకవర్గంలో నిరంతర ప్రక్రియ గా కొనసాగుతున్న శంకుస్థాపనలు ,ప్రారంభోత్సవాలు




విశాఖపట్నం (ప్రశ్న న్యూస్) 27 వార్డు పరిధిలో దొండపర్తి వద్ద ఒక కోటి 28 లక్షల రూపాయలతో కళ్యాణ మండపం , ఐ ఎస్ బి నగర్ వద్ద 34 లక్షలతో కమ్యూనిటీ హాల్ , మధురానగర్ వద్ద 32 లక్షలతో కమ్యూనిటీ హాల్ లను దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ స్థానిక కార్పొరేటర్ వీర రావు , కూటమి వార్డు నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 27 వార్డులో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. వార్డు పర్యటనలో తమ దృష్టికి వచ్చిన ప్రతి పనిని నెరవేర్చమని ఏమైనా మిగిలి ఉన్న పనులు తమ దృష్టికి వచ్చినట్లయితే పూర్తి చేస్తామని తెలియజేశారు. నెహ్రూ బజార్ ఆధునీకరణ తో పాటు మిగిలి ఉన్న పెండింగ్ పనులను అతి త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చమని మరొకసారి గుర్తు చేశారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు , ఈ వెంకటేశ్వరరావు , ఏఈ నిహారిక, సిబ్బంది తో పాటు మాజీ కార్పొరేటర్ రాజు , బీజేపీ సీనియర్ నాయకులు ప్రకాశ్ రెడ్డి , వార్డు టీడీపీ అధ్యక్షులు సత్యనారాయణ గారు, సీనియర్ నాయకులు శివ , పెద్ద రాజు, , సతీష్ , లలిత , గోవింద ఇతర నేతలు పాల్గొన్నారు.

# సైబర్ మోసాల బాధితులకు విశాఖ సిటీ పోలీసుల భారీ సహాయం

- రూ.22.47 కోట్లు రీఫండ్



విశాఖపట్నం(ప్రశ్న న్యూస్) సైబర్ నేరాలపై కఠిన చర్యలు తీసుకుంటూ విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనరేట్ మరో చారిత్రాత్మక మైలురాయిని నమోదు చేసింది. సైబర్ మోసాలకు గురైన బాధితులకు చట్టపరమైన ప్రక్రియల ద్వారా ఫ్రీజ్ చేసిన నిధులను తిరిగి అందిస్తూ రాష్ట్రంలోనే అత్యధికంగా 1,240 మంది బాధితులకు మొత్తం రూ.22.47 కోట్లను రీఫండ్ చేసి విశాఖ సిటీ పోలీస్ కమిషనరేట్ ప్రత్యేక గుర్తింపు సాధించింది.విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ అదనపు జిల్లా మెజిస్ట్రేట్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, ఐపీఎస్ చొరవతో సైబర్ నేరాలపై వేగంగా స్పందిస్తూ బ్యాంకులు సంబంధిత సంస్థలతో సమన్వయం చేసుకోవడం ద్వారా ఈ రీఫండ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ, సైబర్ నేరాలపై వెంటనే స్పందించడం వల్లే బాధితుల డబ్బులను త్వరగా తిరిగి పొందగలిగామని పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కాల్స్, లింకులు, యాప్‌లను నమ్మవద్దని సూచించారు.అలాగే తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్, ఫేక్ కొరియర్ సమాచారం, ఆన్‌లైన్ విచారణ పేరుతో వీడియో కాల్స్, బ్యాంకు ఖాతాల వివరాలు అడిగే వ్యక్తులను నమ్మవద్దని విశాఖ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు

# శాంతి భద్రతల పరిరక్షణలో ఆర్మ్డ్ రిజర్వ్ పాత్ర కీలకం

- ఎస్పీ మహేష్ బి. గితే

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వృత్తి నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి

ఫైరింగ్, రాత పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంశలు

సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో సివిల్ పోలీసులతో పాటు ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ విభాగం కూడా కీలక పాత్ర పోషిస్తూ సమర్థవంతంగా విధులు నిర్వహిస్తోందని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే అభినందించారు.సాయుధ దళాల వార్షిక పునర్ ఉచ్చరణ (మోబిలైజేషన్) ముగింపు కార్యక్రమంలో భాగంగా ఈరోజు ఎస్పీ పరేడ్ మైదానంలో నిర్వహించిన సాయుధ దళాల సమీకరణ కవాతు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పోలీస్ అధికారులు, సిబ్బంది తమ వృత్తి నైపుణ్యాలను మరింత మెరుగుపర్చుకోవాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో సివిల్ పోలీసులతో పాటు ఆర్మ్డ్ రిజర్వ్ విభాగం కూడా ఎంతో సమర్థవంతంగా పని చేస్తోందని, అదే ఉత్సాహంతో భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని సిబ్బందికి పిలుపునిచ్చారు. వార్షిక మోబిలైజేషన్ శిక్షణలో భాగంగా పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఆర్మ్స్ డ్రిల్, లాఠీ డ్రిల్, ఫుట్ డ్రిల్, సెర్మోనియల్ డ్రిల్, గార్డ్ మౌంటింగ్, మాబ్ ఆపరేషన్, ఫైరింగ్, నాకబంది, పికెట్స్, వీఐపీ బందోబస్త్ విధులు, ప్రిసనర్ మరియు క్యాష్ ఎస్కార్ట్ వంటి అంశాలపై శిక్షణ అందించినట్లు తెలిపారు. పోలీస్ ఉద్యోగం ఎంతో బాధ్యతాయుతమైనదని, మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో పోలీసులు తమ వృత్తి నైపుణ్యాలను మర్చిపోకుండా ఎప్పటికప్పుడు గుర్తు చేసుకుంటూ శారీరక దారుఢ్యం కాపాడుకోవాలని ఎస్పీ తెలియజేశారు. ఇందుకు మోబిలైజేషన్ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. నిరంతరం విధుల్లో నిమగ్నమై ఉండే పోలీస్ అధికారులు, సిబ్బందికి వ్యక్తిగత,కుటుంబపరమైన మరియు శాఖాపరమైన సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని ఎస్పీ తెలిపారు. అంతకుముందు వార్షిక శిక్షణలో భాగంగా జిల్లాలో పని చేస్తున్న,అధికారులకు సిబ్బందికి సార్ధపూర్ బెటాలియన్ లో గల ఫైరింగ్ రేంజ్ నందు ఇచ్చే ఫైరింగ్ శిక్షణను జిల్లా ఎస్పీ పర్యవేక్షించారు. అనంతరం ఎస్పీ కూడా ఫైరింగ్ ప్రాక్టీస్



చేయడం జరిగింది. ఫైరింగ్ లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 1 బి. శ్రీనివాస్,2జి. వెంకటేష్, 3. ప్రియాంక.రాత పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 1మనోజ్ కుమార్, 2బి. శ్రీనివాస్, 3డి. ప్రియాంక. ఫైరింగ్, రాత పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలోఅదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్.ఐ లు, ఎస్.ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.

# టౌన్ ప్లానింగ్ అధికారి పై చర్యలు తీసుకోవాలి

రోడ్లను ఆక్రమిస్తూ పేట్రేగిపోతున్న అక్రమార్కులు

అధికారుల కనుసన్నాల్లోనే.? రోడ్ల ఆక్రమణలు జరుగుతున్నాయనే ఆరోపణలు

స్థానికుల ఫిర్యాదులను పట్టించుకోకపోవడం పట్ల ఆగ్రహం





జవహర్ నగర్ (ప్రశ్న న్యూస్) విధి నిర్వహణలో బాధ్యత రహితంగా వ్యవహరిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న టౌన్ ప్లానింగ్ అధికారిని తక్షణమే విధుల నుండి తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కీసర సర్కిల్ పరిధిలోగల జవహర్ నగర్ ప్రాంతం జిహెచ్ఎంసి ప్రాంతంగా అభివృద్ధి చెందిన ఈ సమయంలో చంద్రపురి కాలనీ పెద్దమ్మ గుడి సమీపంలో రోడ్డు స్థలాన్ని ఆక్రమిస్తూ రాత్రికి రాత్రి చేసిన అక్రమ నిర్మాణం పెద్ద చర్చనీయాంశంగా మారింది ఈ రోడ్డు కబ్జా వ్యవహారాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తెచ్చినప్పటికీ ఏలాంటి చర్యలు తీసుకోకుండా శరమామూలే అన్నట్లు నిర్లక్ష్య ధోరణి అవలంబించడంలో ఆంతర్యం ఏమిటీ.? అక్రమ మార్గంలో లభించే అధిక మామూళ్ల మహత్యమా.? చట్టం మా చుట్టమే మేము చెప్పిందే వేదం మేము చేసేదే శాసనం అని అధికారుల అహంభావమా.? లేక అక్రమార్కుల దుస్సాహసమా.? అనే అనుమానాలు స్థానికుల నుండి వ్యక్తం అవుతున్నాయి అధికారులు ఎలాంటి అక్రమాలకు పాల్పడకుండా సక్రమంగా విధులు నిర్వహించిన యెడల రోడ్డు స్థలాన్ని కబ్జా చేసి చట్టానికి సవాల్ విసురుతూ దుస్సాహసానికి ఒడిగట్టి దౌర్జన్యంగా నిర్మించిన ఈ అక్రమ నిర్మాణాన్ని అధికారులు నేటి వరకు తొలగించకపోవడం అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రభుత్వం ఇచ్చే జీతాల కన్నా అధికారులు అక్రమ మార్గంలో వచ్చే అధిక సంపాదనకు ఆసక్తి చూపుతూ విధి నిర్వహణలో బాధ్యత రహితంగా వ్యవహరిస్తూ అధికార దుర్యోగానికి పాల్పడుతున్నారు అనడానికి నిలువెత్తు నిదర్శనం ఈ రోడ్డు స్థలాన్ని ఆక్రమిస్తూ నిర్మాణం చేసిన ఈ అక్రమ నిర్మాణం నిలువెత్తు నిదర్శనం కాదా.? అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు

### మున్సిపల్ నిబంధనలను ఉల్లంఘిస్తూ అక్రమాలకు పాల్పడుతున్న టౌన్ ప్లానింగ్ అధికారి

జవహర్ నగర్ నగరపాలక సంస్థగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి గృహ నిర్మాణాల అనుమతులను రద్దు చేయడం జరిగింది అయితే ఈ గృహ నిర్మాణాల అనుమతుల రద్దు వ్యవహారం జవహర్ నగర్ నివాసితులకు సంకటంగా మారి అభివృద్ధికి అంతరాయం కలగడంతో పాటు నగరపాలక సంస్థకు వచ్చే నిధులకు భారీ నష్టం వాటిల్లింది ఈ గృహ నిర్మాణాల అనుమతుల రద్దు నిబంధనలను టౌన్ ప్లానింగ్ వ్యవస్థ ఒక సదావకాశంగా భావించి గృహ నిర్మాణాల అనుమతులు లేవంటూ కొన్నిచోట్ల జెసిబి లతో నామమాత్రంగా కూల్చివేతలకు



పాల్పడి గృహ నిర్మాణదారులను భయభ్రాంతులకు గురిచేసి ప్రభుత్వ ఉద్యోగిని అనే విషయాన్ని మరిచి దొడ్డి దారిన దోపిడీకి పాల్పడ్డారు తప్ప గృహ నిర్మాణాల రద్దు నిబంధనలను పాటించి గృహ నిర్మాణాలను అదుపు చేసేందుకు ఏనాడు ఏమాత్రం ప్రయత్నించలేదని స్థానికులు పలుమార్లు విమర్శిస్తూ వచ్చారు గత ఆరు సంవత్సరాల వ్యవధిలో టౌన్ ప్లానింగ్ అధికారిగా మున్సిపల్ నిబంధనల ప్రకారం సెట్ బ్యాక్ నిబంధనలు గాలికొదిలి రోడ్లను సైతం ఆక్రమిస్తూ నిర్మించిన భవనాలపై ఏ మాత్రం చర్యలు తీసుకోకుండా బాధ్యత రహితంగా వ్యవహరించి విధి నిర్వహణలో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు పాల్పడుతున్నారు అని స్థానికులు మండిపడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగిని అనే విషయాన్ని మరిచి మున్సిపల్ కార్యాలయాన్ని అక్రమాల ఆలయంగా మార్చారు తప్ప ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని మున్సిపల్ నిబంధనలను ఏనాడు పాటించకపోవడం వల్ల నేడు జవహర్ నగర్ రోడ్లన్నీ ఆక్రమణకు గురై జవహర్ నగర్ ప్రాంతం అస్తవ్యస్తంగా మారిందని దుమ్మెత్తి పోస్తున్నారు నేడు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతంగా అభివృద్ధి చెందిన ఈ సమయంలోనైనా టౌన్ ప్లానింగ్ అధికారి గత ఆరు సంవత్సరాల వ్యవధిలో బాధ్యతారహితంగా వ్యవహరించిన తీరు పట్ల సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి విధి నిర్వహణలో అధికార దుర్వినియోగానికి పాల్పడిన టౌన్ ప్లానింగ్ అధికారిపై తగు చర్యలు తీసుకోవాలని తన అక్రమ ఆస్తులపై దర్యాప్తు జరిపించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు

# కల్తీ ఆహార పదార్థాల కేంద్రాలపై పోలీసులకు పాదం

కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేసి విక్రయిస్తున్న ఒక నిందితుడి అరెస్ట్

కల్తీ అల్లం పేస్ట్ తయారు చేసిన వ్యక్తి మహమ్మద్ ఫారూఖ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ కమిషనర్స్ టాస్క్ ఫోర్స్ (ఖైరతాబాద్ జోన్ టీమ్) అధికారులు హబీబ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లేపల్లి, అఫ్జల్‌సాగర్, గటాల మసీదు సమీపంలో ఉన్న “షెహజాదా ఫుడ్ మాస్టర్” ప్రాంగణంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో అఘాపురా నివాసి, సదరు సంస్థ యజమాని అయిన మహమ్మద్ ఫారూఖ్ (50) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.తనిఖీ సమయంలో, నిందితుడు అత్యంత అపరిశుభ్రమైన వాతావరణంలో అసిటిక్ యాసిడ్, సింథటిక్ ఫుడ్ కలర్స్, గమ్ పౌడర్ మరియు ఉప్పు వంటి రసాయనాలను కలిపి ప్లాస్టిక్ కంటైనర్లలో అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను తయారు చేస్తున్నట్లు గుర్తించారు. తయారు చేసిన పేస్ట్‌ను తెరిచి ఉన్న ప్లాస్టిక్ టబ్‌లలో నిల్వ ఉంచడం వల్ల అది దుమ్ము, ఈగలు, ఇతర కలుషితాలకు గురై, మానవ వినియోగానికి ఏమాత్రం సురక్షితం కాదని తేలింది. నిందితుడు ఈ కల్తీ పేస్ట్‌ను వివిధ హోల్‌సేల్ కిరాణా దుకాణాలు ఫుడ్ క్యాటరింగ్ సర్వీసులకు సరఫరా చేస్తూ అక్రమంగా భారీ లాభాలను గడిస్తున్నాడు. సదరు ప్రాంగణంలో ఉన్న ఖీూూూ× లైసెన్స్ (నెం. 13617011001223) గడువు 07-09-2018తోనే ముగిసిపోయిందని అధికారులు గమనించారు. మానవ ప్రాణాలకు హానికరమైన ఈ కల్తీ ఉత్పత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న వస్తువులు: మొత్తం రూ. 2,20,000/- విలువైన ఈ క్రింది వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

# స్పీకర్ తీర్పు ప్రజాస్వామ్యానికి పెద్ద దెబ్బ

**హైదరాబాద్** పార్టీ ఫిరాయింపుల కేసులో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి లకు స్పీకర్ క్లిన్ చిట్ ఇవ్వడం ప్రజాస్వామ్యానికి పెద్ద దెబ్ అని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ బీఫామ్పై ఎంపి గా పోటీ చేసి వ్యక్తి కి క్లిన్ చిట్ ఇవ్వడం అంటే ప్రజలు ఇచ్చిన తీర్పును నిర్లక్ష్యం చేసినట్టే. పార్టీ మార్పులను నియంత్రించాల్సిన స్పీకర్ వ్యవస్థ, అదే ఫిరాయింపులకు రక్షణగా నిలవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. ప్రజల ఓట్లతో గెలిచిన పదవులను వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కోసం మార్చుకోవడం సరైంది కాదని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే ఈ తరహా నిర్ణయాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు. సరైన సమయంలో ప్రజలే తగిన తీర్పు ఇస్తారని అన్నారు.

# పెళ్లి విషయంలో ప్రేమజంట వాగ్వాదం..

- మాట నెగ్గలేదని ప్రియుడు ఆత్మహత్య

**మహబూబాబాద్** ఈ రోజే పెళ్లి చేసుకుందామన్న యువకుడు.. ఇంటర్ పరీక్షల తర్వాత చేసుకుందామని చెప్పిన యువతి, దీంతో మనస్తాపం చెంది ఉరి వేసుకొని ప్రియుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మహబూబాబాద్ జిల్లాలో ఘటన జరిగింది. కురవికి చెందిన పెయింటర్ వల్లపునేని శశికుమార్ (21), కేసముద్రం శివారు తండాలోని ఇంటర్ చదువుతున్న యువతి (20).. ఒకరినొకరు సంవత్సర కాలం నుంచి ప్రేమించుకుంటున్నారు. అయితే శశికుమార్.. యువతికి ఫోన్ చేసి, ఇద్దరం ఈ రోజే పెళ్లి చేసుకుందామని పట్టుబట్టగా.. అయితే ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయని, అవి పూర్తయ్యాక పెళ్లి చేసుకుందామని యువతి సర్దిచెప్పింది. ఈ విషయమై ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా.. ప్రియురాలు తన మాట వినకపోవడంతో క్షణికావేశానికి గురై శశికుమార్ కురవిలోని తన ఇంట్లో ఫ్యాన్కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

# కాకినాడ జిల్లాలో హడలెత్తిస్తున్న పెద్దపులి

**కాకినాడ** గత పదిరోజులుగా పోలవరం ,కాకినాడ జిల్లాలలో తన సంచారం తో పెద్ద పులి హడలెత్తిస్తుంది. ఏలేరు నదీ పరివాహక ప్రాంతం, ఏలేరు వెనుక జలాలు మరియు అటవీ ప్రాంతాలలో పెద్ద పులి తిరుగుతోంది. బుధవారం ప్రత్తిపాడు మండలం ధారపల్లి వద్ద వాటర్ ఫాల్స్ సమీపంలో సంచరిస్తున్నట్లుగా అధికారులు ధ్రువీకరించారు. స్థానిక రెవెన్యూ సిబ్బంది, పోలీస్ మరియు అటవీ శాఖ అధికారుల ఆధ్వర్యంలో పరిసర గ్రామాల్లో విస్తృత ప్రచారం చేసారు. స్థానిక ప్రజలను అప్రమత్తం చేస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేస్తున్నారు. ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం , కిత్తమూరి పేట, కె .మిర్తివాడ , ఉలిగోగుల, మెట్టు చింత, ధారపల్లి గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసారు.

# గ్రామీణ మహిళలకు అండగా ప్రజా ప్రభుత్వం

- చొప్పదండి ఎమ్మెల్యే : డాక్టర్ మేడిపల్లి సత్యం
-బోయినిపల్లి లో మహిళా సంఘాల భవన నిర్మాణాలకు శ్రీకారం
- జాగృతి సమైక్య సభ్యులకు రూ.45 కోట్ల వడ్డీలేని రుణాలు



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రంలో బుధవారం ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ధరిత్రి,శ్రీలక్ష్మి, తులసి గ్రామ సంఘాల భవన నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన 99 రోజుల ప్రణాళికలో భాగంగా మహిళా శక్తి కార్యక్రమాల ద్వారా మహిళలకు వివిధ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. జాగృతి మండల సమైక్య సభ్యులకు ఈ సంవత్సరం 45 కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.అదేవిధంగా ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ద్వారా అందిస్తున్న క్యాటిల్ షెడ్స్, ఫౌల్ట్రి ఫామ్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన సిబ్బంది మరియు సంఘ అధ్యక్షులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి.ఓ ఎం. గీత, ఎంపీడీఓ బి. జయశీల, మండల పంచాయితీ అధికారి ఏ. శ్రీధర్, ఏఎంసి అధ్యక్షులు ఎల్లేష్ యాదవ్, ఏఎంసి ఉపాధ్యక్షులు ఎన్. వినోద్ రెడ్డి, స్థానిక సర్పంచ్ ఎన్. మోహన్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వి. రమణారెడ్డి, సీసీలు, ఏపీఎంలు, ఏపీఓలు, టీఏలు, ఈసీలు, వార్డ్ మెంబర్లు, వివిధ గ్రామాల గ్రామ సంఘాల అధ్యక్షులు, వివోఏలు పాల్గొన్నారు.

## నల్ల గంగమ్మ అమ్మవారి జాతర ప్రారంభం..



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తి పట్టణం బహుదూర్‌పేటలో గల శ్రీ శ్రీ నల్లగంగమ్మ తల్లి జాతర ప్రారంభమైంది. ఈ జాతరకు చుట్టుపక్కల ప్రాంతాల భక్తులే కాకుండా సుదూర ప్రాంతాల నుండి లక్షలాదిగా భక్తులు తరలి వస్తారు. బహుదూర్ పేట నల్ల గంగమ్మ జాతర అంగరంగ వైభవంగా ప్రారంభో అవుతుంది.శ్రీ వాయు లింగేశ్వరుడు వెలసిన పవిత్ర పుణ్యక్షేత్రంలో నల్ల గంగమ్మ వైభవం. అమ్మవారి జాతర చూసేందుకు భారీ స్థాయిలో ప్రజలు తరలివస్తున్నారు. శ్రీ కాళహస్తీశ్వరుని సన్నిధికి అతి సమీపంలో ఉన్న బహదూర్ పేట నల్ల గంగమ్మ ఏటా జాతర నిర్వహించడం అనవాయితీగా వస్తుంది. ప్రతి సంవత్సరం నిర్వహించే విధంగానే ఈ ఏడాది బహుదూర్ పేటలో నల్ల గంగమ్మ జాతర అత్యంత వేడుకగా స్థానిక సాంప్రదాయ పద్ధతిలో ప్రారంభమయ్యాయి మంగళవారం అర్ధరాత్రి మొదలుకొని బుధవారం వేకువజాము వరకు గంగమ్మ ఆలయంలో మూలవిరాట్ కు విశేష అభిషేకాది కార్యక్రమాలు శాస్త్రయోక్తంగా నిర్వహించారు. అభిషేక సేవ అనంతరం అమ్మవారి ఎదుట మహాకుంభం వేసి మహా నైవేద్య సమర్పణ కార్యక్రమాన్ని సాంప్రదాయ పద్ధతిలో ఆలయ అర్చకులు రజకులు నిర్వహించారు మహా నైవేద్యం, మహాబలి సమర్పించి హారతులు సమర్పించారు. గంగమ్మ నామస్మరణ చేస్తూ బలి పూజలు ఎక్కడ అనంతరం ప్రతిములు పసుపు ముద్దలు ప్రతిములను విశేష పూజలు జరిపి నల్ల గంగమ్మ ప్రతినిధులు తమ నల్ల గంగమ్మ చెప్పరాల వద్దకు తీసుకువెళ్లి సంప్రదాయ పద్ధతిలో పూజలు చేసి కొలువు తీర్చి గ్రామోత్సవం ప్రారంభించారు. మూల విరాట్ పూజల అనంతరం నల్ల గంగమ్మను వారి స్థానాలలో కొలువు తీరుస్తారు. అమ్మవారి దివ్య మంగళస్వరూపాలను ఆకర్షణీయంగా నల్ల గంగమ్మను, విశేష అలంకారాలు భక్తులను విశేషంగా ఆకర్షించాయి. తెల్లవారుజామున పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించడానికి తరలివచ్చి కర్పూర నీరాజనాలు పట్టుతూ కొబ్బరికాయలు కొట్టి సంప్రదాయ పద్ధతిలో మొక్కులు చెల్లించారు. కొందరు బలిలిచ్చి అమ్మవారిని సంతృప్తి పరిచారు. పోలీసులు అత్యంత కట్టుదిట్టమైన చర్యలతో బందోబస్తు నిర్వహించారు. అమ్మవారు నల్ల గంగమ్మను ఆలయం నుంచి మూలస్థానాలకు అత్యంత వేడుకగా బయలుదేరి వెళ్లాయి. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మూలస్థానాల్లో అమ్మవాళు ్ళ కొలువుతిరి భక్తులకు కరుణాకటాక్షాలు అనుగ్రహించునున్నారు.

## మెడిసిటీ ఇన్స్టిట్యూట్ లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలోని ఘనపూర్ మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని బుధవారం ఇన్స్టిట్యూట్ ఆడిటోరియంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. షేర్ ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా.పియస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సీనియర్ గైనకాలజిస్టు, ది అబ్స్టెట్రిక్స్ మరియు గైనకాలజికల్ సొసైటీ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షురాలు డా.జయంతి రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డా.పియస్ రెడ్డి మాట్లాడుతూ మహిళల సామాజిక, ఆర్థిక, రాజకీయ విజయాలను గుర్తించి, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడానికి జరుపుకునే ఒక ముఖ్యమైన దినోత్సవమని అన్నారు. అనంతరం షేర్ మెడికల్ కేర్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ కె. శివరామకృష్ణ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ప్రవేశిస్తున్నారని ముఖ్యంగా వైద్య సంబంధిత రంగాలలో నానాటికీ వీరి పాత్ర ఎక్కువగా ఉందన్నారు. ఎంతో కష్టపడి వైద్య సంబంధిత రంగాలలో ప్రవేశిస్తున్న మహిళలు తమను తాము నిరూపించుకొంటూ రాణించాలని పేర్కొన్నారు. డా. జయంతి రెడ్డి మాట్లాడుతూ కొన్ని దశాబ్దాల క్రితంతో పోలిస్తే నేటి మహిళలకు అన్ని రంగాలలో అవకాశాలు మెండుగా లభిస్తున్నాయన్నారు. పురుషులతో సమానంగా పోటీ పడుతున్న నేటి మహిళలు ధీటుగా పని చేస్తూ మంచి పేరు సంపాదిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కు చెందిన మహిళా వైద్యులు, సిబ్బంది, విద్యార్థినులు చేసిన సాంస్కృతి కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాలలో డా. దేవేంద్ర సింగ్ నేగి, ప్రిన్సిపాల్, డా. శైలేంద్ర,డా. సి.గీత, డా. బి.కల్పన,డా. కిరణ్మయి.డా. దీపిక,డా. కృతి, డా. మృణాళిక, ఎంబిబిఎస్,పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

# బోయినిపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే సత్యం పర్యటన

- పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
- ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో వేగంగా అభివృద్ధి పనులు
-చొప్పదండి ఎమ్మెల్యే : డా. మేడిపల్లి సత్యం







బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)చొప్పదండి నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం తెలిపారు.
ఈ సందర్భంగా బోయినిపల్లి మండల కేంద్రంలో స్వశక్తి మహిళా సంఘం నూతన భవనాల నిర్మాణానికి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం భూమిపూజ నిర్వహించారు. మహిళల సంఘాలకు స్థిరమైన వేదిక ఏర్పడటంతో వారి కార్యకలాపాలు మరింత బలోపేతం అవుతాయని ఆయన పేర్కొన్నారు.

### బూరుగుపల్లి లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంఖుస్థాపన

అనంతరం బోయినిపల్లి మండలం బూరుగుపల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామాల అభివృద్ధికి మౌలిక వసతుల కల్పన అత్యంత అవసరమని, మంచి రహదారులు నిర్మించడం ద్వారా ప్రజలకు సౌకర్యాలు మెరుగుపడతాయని ఎమ్మెల్యే అన్నారు.

### వికలాంగునికి స్కూటీ అందజేత

బోయినిపల్లి మండలం కొదురుపాక గ్రామానికి చెందిన వికలాంగుడు పెంజర్ల దేవరాజుకు ప్రభుత్వం మంజూరు చేసిన స్కూటీని ఎమ్మెల్యే అందజేశారు. వికలాంగుల జీవనోపాధి, రవాణా సౌకర్యాల కోసం ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు.

### గంజివాగు హై - లెవల్ బ్రిడ్జి నిర్మాణం పనులు పరిశీలన

అలాగే బోయినిపల్లి మండలం స్థంభంపల్లి గ్రామంలోని గంజివాగు హై లెవల్ బ్రిడ్జి చివరి దశ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. పనులను వేగవంతం చేసి త్వరలోనే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు,ఆయా గ్రామాల సర్పంచులు, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రాయిలాపూర్ లో రైతు శిక్షణ కార్యక్రమం



మేడ్చల్( ప్రశ్న న్యూస్ )మేడ్చల్ డివిజన్ పరిధిలోని రైలాపూర్ రైతు వేదికలో బుధవారం మండల వ్యవసాయ అధికారి ఎస్. మాధవరెడ్డి ఆధ్వర్యంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య రైతుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కొత్త వంగడాల సాగు గురించి రైతులకు తెలియజేయడం జరిగిందని అన్నారు. అదేవిధంగా ఉద్యాన శాఖలో అందుబాటులో ఉన్న కూరగాయలు, విత్తనాల సబ్సిడీ గురించి, క్రిప్ మల్చింగ్, పండ్ల తోటలు, తీగ జాతి కూరగాయల పంట యొక్క సబ్సిడీ పథకాలను గురించి వివరించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఎమ్. సుమిత్, కె.తేజస్విని, ఉద్యాన శాఖ అధికారి వెంకటరమణ, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ వారియర్స్ క్రికెట్ టోర్నీ సెమీ ఫైనల్ కు దూసుకెళ్లిన కిష్టాపూర్ టీం



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ సర్కిల్ పరిధిలో మేడ్చల్ వారియర్స్ క్రికెట్ టోర్నమెంట్ రసవత్తరంగా సాగుతుంది.ఈ నెల 9వ తేదీన ప్రారంభించిన క్రికెట్ టోర్నీ నేటితో ముగియనుంది. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ లో మారుతి మేడ్చల్ టీమ్, కిష్టాపూర్ టీములు తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన మారుతి మేడ్చల్ టీం ఆరు ఓవర్లలో రెండు వికెట్లు నష్టపోయి 74 పరుగులు చేసింది.చేదనలో బ్యాటింగ్ దిగిన కిష్టాపూర్ టీం కేవలం 4.4 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా లక్ష్యాన్ని చేదించారు. ఓపెనర్లు సతీష్ 3 సిక్సులు, 3 ఫోర్ లతో 36 పరుగులు చేయగా, లెఫ్ట్ అండర్ బ్యాట్స్మెన్ జాన్ కేవలం 15 బాల్స్ లలో 2 సిక్సులు,5 ఫోర్ లతో వీర విహారం చేశారు. దీంతో కిష్టాపూర్ టీం సెమీస్ లో అడుగు పెట్టింది.

## సాగునీటిని విడుదల చేయాలని రైతుల రాస్తారోకో

**సూర్యాపేట** సూర్యాపేట జిల్లాలో రైతుల ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. నాగారం మండల కేంద్రంలో సూర్యాపేటజనగామ ప్రధాన రహదారిపై రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఎస్సారె-స్పీ కాలువల ద్వారా వెంటనే సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద సంఖ్యలో రైతులు రోడ్డుపైకి వచ్చారు. వరి పంట ప్రస్తుతం పొట్ట దశకు చేరుకున్నప్పటికీ నీరు లేకపోవడంతో చేలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఎస్సారెస్పీ నీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. రైతుల రాస్తారోకోతో సూర్యాపేట? జనగామ ప్రధాన రహదారిపై కొంతసేపు రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని రైతులతో చర్చలు జరుపుతున్నారు. సూర్యాపేట జిల్లాలో రైతుల ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. నాగారం మండల కేంద్రంలో సూర్యాపేట?జనగామ ప్రధాన రహదారిపై రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఎస్సారెస్పీ కాలువల ద్వారా వెంటనే సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద సంఖ్యలో రైతులు రోడ్డుపైకి వచ్చారు. వరి పంట ప్రస్తుతం పొట్ట దశకు చేరుకున్నప్పటికీ నీరు లేకపోవడంతో చేలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఎస్సారెస్పీ నీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలి : జాకట ప్రేమ్ దాస్

పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేత



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ సర్కిల్ పరిధిలోని అత్వెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు బీజేపీ సీనియర్ నాయకులు జాకట ప్రేమ్ దాస్ పరీక్ష సామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా జాకట ప్రేమ్ దాస్ మాట్లాడుతూ ఇప్పుడు ఉన్న అన్ని రంగంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు మంచి అవకాశాలు దక్కించుకోడానికి ఆస్కారం వుంటుందన్నారు. విద్యార్థులు కష్టంతొ కాకుండా ఇష్టపడి చదువుకోవడం వలన మంచి మార్కులు మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. రేపటి భవిష్యత్తుకు పదవ తరగతి పరీక్షలు మొదటి మెట్టు లాంటివని అన్నారు. ఒక మంచి లక్ష్యం ఏర్పాటు చేసుకొని ఆ లక్ష్యాన్ని సాధించేవరకు విశ్రమించొద్దని తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశంలో ఉచితంగా విద్యా విధానం అమలు చేయడానికి ప్రణాళికలు అన్ని రకాలుగా సిద్ధం చేశారని, కాని కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న ప్రణాళికను అనుసరించకుండా, రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంను పట్టించుకోకుండా, ఉపాధ్యాయుల నియమకలనూ చేపట్టకుండా నిర్లక్ష్యం చేయడం వల్ల చాలా మంది పేద విద్యార్థులు చదువు కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి లవంగ శ్రీకాంత్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు రాగం అర్జున్, ఎల్లంపేట మున్సిపల్ ప్రధాన కార్యదర్శి మహేష్, బిజెపి కార్యదర్శి బండి విష్ణుమూర్తి, సాయి కుమార్, వంశీధర్ రెడ్డి, బాబు రాజు, మహేష్ గౌలికర్, బాబు గౌడ్, నరేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ సహా ఇరువురికి షోకాజ్ నోటీసులు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి




నిజామాబాద్(ప్రశ్న న్యూస్) నవీపేట మండలం మోకన్ పల్లిలో కొనసాగుతున్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్ లను తనిఖీ చేశారు. నిర్వహణపరమైన లోపాలను గమనించిన కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇంచార్జి స్పెషల్ ఆఫీసర్ కవితతో పాటు, బోధనా విధులలో కొనసాగుతున్న రాజశ్రీకి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. బాలికల విద్యాలయాల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించబోమని, విద్యార్థినుల భద్రతకు, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. పాఠశాల పరిసరాలు నిశితంగా పరిశీలించిన కలెక్టర్, ఎట్టి పరిస్థితుల్లోనూ బయటి వ్యక్తులు ఏ ఒక్కరిని కూడా లోనికి అనుమతించకూడదని అన్నారు. అనంతరం 10వ తరగతి క్లాస్ రూంను కలెక్టర్ సందర్శించి, విద్యార్థినులకు పాఠాలు బోధించి, పలు ప్రశ్నలు వేస్తూ వారి బోధనా సామర్థ్యాన్ని పరిశీలించారు. చక్కగా చదువుకుని ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని సూచించారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ధైర్యంగా అధికారులకు ఫిర్యాదు చేయాలని, అనారోగ్య సమస్యలు తలెత్తితే నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. విద్యార్థినుల కోసం పాఠశాలలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్ ను కలెక్టర్ పరిశీలించారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ గురించి బాలికలకు వైద్యులు చక్కగా అవగాహన కల్పించడం పట్ల వారిని కలెక్టర్ అభినందించారు. కేజీబీవీ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

# మహిళలకు ఆర్థిక అంశాల పై పట్టు రావడం అత్యంత అవసరం

### ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి
### కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్ ప్రతినిధి ((ప్రశ్న న్యూస్ ) బుధవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఘనంగా మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, మెదక్ మున్సిపల్ చైర్మన్, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ , ప్రజా ప్రతినిధులు అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన ద్వారా కలెక్టర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో ముఖ్యమని, మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం, సమాజం, దేశం కూడా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని, ప్రభుత్వం అందిస్తున్న పలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు చిన్నతరహా వ్యాపారాలు ప్రారంభించి స్వయం సమృద్ధిని సాధించవచ్చని తెలిపారు.మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, రుణ సౌకర్యాలు, ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వారిని ఆర్థికంగా బలపర్చే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. ప్రతి మహిళ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి ఆర్థిక స్వతంత్రం సాధించాలని పిలుపునిచ్చారు.

**- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ**

మహిళకు,పురుషులకు గతంలో చాలా వ్యత్యాసాలు ఉండేవని, ఓటు హక్కు కూడా లేదని, వీటిపై చాలామంది మహిళల పోరాటం వల్ల మహిళలకు హక్కులు కల్పించబడ్డాన్నారు. గతంలో మహిళా కమిషన్ చైర్పర్సన్ గా ఉండి పురుషులకు మహిళల హక్కుపై అవగాహన కల్పించినట్లు గుర్తు చేశారు. మహిళలు బలహీనులు కాదు ,బలవంతులన్నారు. మహిళలుఅవకాశాలను అందింపుచ్చుకోవాలన్నారు. మహిళలకు నమ్మకం, ఆత్మవిశ్వాసం ముఖ్యమన్నారు. మహిళలకు మహిళాచట్టాల పై అవగాహన కల్గి ఉండాలన్నారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ..

మహిళల సాధికారత కోసం సమాజం మొత్తం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. మహిళలు అన్ని రంగాలలో ముందుకు వచ్చి సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని ఆకాంక్షించారు.అనంతరం మహిళలకు శాలువ,మెమెంటో తో సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మాచునూరి లక్ష్మి డి డబ్ల్యు హేమ భార్గవి,జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మాధవి, షెడ్యూల్ కులాల నిర్వహణ అధికారి, విజయలక్ష్మి, గిరిజన సంక్షేమ అధికారి నీలిమ, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు దొంతి నరేందర్ , కార్యదర్శి రాజ్

## వార్డు సభ్యులకు గౌరవ వేతనం అమలు చేయాలి

**- గ్రామాల అభివృద్ధి లో వార్డు సభ్యుల పాత్ర కీలకం**
**-తెలంగాణ వార్డు సభ్యుల సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు**
**- గంగాధర గంగజమున - వెంకటరమణ**



బోయినిపల్లి ( ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ వార్డు సభ్యులకు గౌరవ వేతనం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షులు గంగాధర గంగజమున - వెంకటరమణ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల సమస్యలను పరిష్కరించడం,సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడం వంటి బాధ్యతలను వార్డు సభ్యులు నిబద్ధతతో నిర్వర్తిస్తున్నారని తెలిపారు. గ్రామ పంచాయతీ అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర అత్యంత కీలకమైందని, అయినప్పటికీ వారు ఎటువంటి వేతనం లేకుండా సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి గ్రామ పంచాయతీ వార్డు సభ్యులకు గౌరవ వేతనం అమలు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. అలాగే జిల్లా వ్యాప్తంగా వార్డు సభ్యుల సంక్షేమ సంఘం తరపున త్వరలో అన్ని జిల్లాల్లో కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

## గల్ఫ్‌కు పంపిస్తామని మోసం - ఇద్దరు అరెస్ట్

**- వేములవాడ రూరల్ ఎస్సై : చల్లా వెంకట్రాజం**



వేములవాడ (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ రూరల్ మండలం, నూకలమర్రి గ్రామానికి చెందిన గుగులోతు రవిని విదేశాలకు పంపిస్తామని చెప్పి రూ.3 లక్షలు తీసుకొని మోసం చేసిన ఇద్దరిని రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వేములవాడ రూరల్ ఎస్ఐ వెంకట్రాజం తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా కు చెందిన శ్రీకృష్ణ ట్రావెల్స్‌కు చెందిన దండుగుల మల్లేశం, పల్లపు నాంపెల్లి.. రవిని అల్మీరియా దేశానికి పంపిస్తామని చెప్పి డబ్బులు తీసుకున్నారు. అక్కడ ఒప్పందం చేసిన పని కాకుండా వేరే పనిలో పెట్టడంతో తాను మోసపోయానని గ్రహించిన రవి భారత్‌కు వచ్చి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై వెంకట్రాజం తెలిపారు.

## కొల్చారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో వైద్య శిబిరం ఏర్పాటును పరిశీలించిన

**జిల్లా ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండల పరిధిలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల అనుసరించి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఈరోజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొల్చారం నందు వైద్య శిబిరము నిర్వహించడం జరిగింది ఈ వైద్య శిబిరానికి వివిధ రకాల స్పెషలిస్ట్ డాక్టర్లు1 డాక్టర్ శ్రేయ గైనకాలజిస్ట్,2. డాక్టర్ వైష్ణవి పిల్లల వైద్య నిపుణురాలు, డాక్టర్ రవళి కంటి నిపుణురాలు, డాక్టర్ వర్ష ఆర్థోపెడిక్ , డాక్టర్ రాఘవేందర్ జనరల్ ఫిజీషియన్ , డాక్టర్ రాజశేఖర్ డెంటల్ విచ్చేసి మన ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న వివిధ గ్రామాలను వచ్చిన ప్రజలను అందర్నీ పరీక్షించి అందించడం జరిగింది ల్యాబ్ పరీక్షలు కూడా చేయించడం జరిగింది అదేవిధంగా ఎవరికైనా ఇంకా సమస్యలు ఉంటే ++ఎ మెదక్ కు రిఫరల్ చేయడం జరిగింది ఈరోజు చూపించుకున్న పేషంట్ల సంఖ్య 215 మందిని చూడడం జరిగింది అదేవిధంగా ఈరోజు క్యాంపును ఆకస్మికంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్ సందర్శించి పలు సూచనలు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రమేష్ , ఎస్ మదన్మోహన్ ఎం పి హెచ్ ఇ ఓ సూపర్వైజర్స్ మార్తా,యేసుమని, శాంతి కుమార్ మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేయుచున్న సిబ్బంది మరియు ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన వీడ్కోలు సమావేశం.

**విద్యార్థులకు అభినందనలు తెలియజేసిన**
**ప్రధానోపాధ్యాయురాలు దాసరి లక్ష్మి**



మంథని( ప్రశ్న న్యూస్)గుంజపడుగు హైస్కూల్లో నేడు పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు .ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు,మంథని మండల విద్యాధికారి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు ప్రగతికి తొలి మెట్టు పదవ తరగతి పరీక్షలు కాబట్టి ఏకాగ్రతతో ఎలాంటి ఒత్తిడి లేకుండా ఈ పరీక్షలలో ప్రతిభ చాటాలని కోరారు.క్రమశిక్షణ విద్యార్థి జీవన విధానానికి దిక్సూచి పని చేస్తుందని క్రమశిక్షణ తో భవిష్యత్ లో మంచి విజయాలు సాధించాలని కోరారు.వేంపాడు ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన కొండల్ రెడ్డి అనే ఉపాధ్యాయున్ని సన్మానించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమానికి అతిథి లుగా ముత్తారం మండల విద్యాధికారి హరిప్రసాద్, గ్రామ ఉపసర్పంచ్ లక్ష్మి సదానందం ఉపాధ్యాయులు సురేష్,రవి, సంగీత, భూమయ్య, స్వామి, రవీందర్, నరేందర్, సతీష్ రెడ్డి, సమ్మయ్య ఇంకా విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు

## తిరుపతి దర్శనం పేరుతో మోసం..

### రూ.18.46 లక్షలు కోల్పోయిన విశ్రాంత ఉద్యోగి

**- కేసు నమోదు - దర్యాప్తు ప్రారంభం**
**- బోయినిపల్లి ఎస్సై : రమాకాంత్**




బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలానికి చెందిన ఓ విశ్రాంత ఉద్యోగిని తిరుపతి దర్శనం, ట్రైన్ టిక్కెట్లు బుక్ చేస్తానని నమ్మబలికి భారీ మొత్తంలో డబ్బులు మోసం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధర మండలం,ఓద్యారం గ్రామంలోని వేంకటేశ్వర దేవాలయంలో పూజారిగా పనిచేస్తున్న సాయి తరుణ్ అనే వ్యక్తి ఫోన్ ద్వారా పిర్యాదుదారుడిని సంప్రదించి తిరుపతి దర్శనం, ట్రైన్ టిక్కెట్లు బుక్ చేస్తానని చెప్పి నమ్మించాడు.ఆ నమ్మకాన్ని ఆసరాగా చేసుకొని పిర్యాదుదారుడి ఫోన్ ద్వారా దఫాదఫాలుగా మొత్తం రూ.18,46,885 లను ఇల్లంతకుంట మండలంలోని నర్సక్కపేట గ్రామానికి చెందిన దామర హరీష్ నంబర్‌కు ట్రాన్స్ఫర్ చేయించుకున్నట్లు తెలిసింది.మోసపోయినట్టు గుర్తించిన పిర్యాదుదారుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బోయినిపల్లి ఎస్సై రమాకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేదలకు గృహ స్వప్నం నెరవేర్చుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**- చొప్పదండి ఎమ్మెల్యే : డాక్టర్ మేడిపల్లి సత్యం**
**-ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు : సురుగు సురేఖ**
**- నాంపల్లి దంపతులకు ఎమ్మెల్యే సన్మానం - శుభాకాంక్షలు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి చేసుకొని ఇటీవల నూతన గృహప్రవేశం వేడుకను నిర్వహించిన లబ్ధిదారు సురుగు సురేఖ - నాంపల్లి దంపతులను బుధవారం చొప్పదండి నియోజకవర్గ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం మాట్లాడుతూ పేదలకు సొంత ఇల్లు కల కలగానే మిగలకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఆ కలను సాకారం చేస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని ప్రధానంగా తీసుకొని ప్రతి అర్హులైన కుటుంబానికి గృహ సదుపాయం కల్పించే దిశగా కృషి చేస్తోందన్నారు. ఇల్లు నిర్మించుకొని గృహప్రవేశం జరుపుకున్న సురుగు సురేఖ -- నాంపల్లి దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి కుటుంబం ఆనందంగా, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, గ్రామ ఉప సర్పంచ్ కల్లెపల్లి చంద్రయ్య, మండల నాయకులు కొలుపుల ప్రవీణ్, వార్డు సభ్యులు అతికం రాజశేఖర్ గౌడ్, నాయకులు నాగార్జున్, కనపర్తి వెంకటాచారి, గడ్డం శ్రీనివాస్, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో అన్నప్రాసన కార్యక్రమం



వేములవాడ (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణంలోని జగిత్యాల బస్టాండ్ ఏరియాలోని అంగన్వాడీ కేంద్రంలో బుధవారం సీడీపీఓ సౌందర్య ఆదేశాల మేరకు చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ శోభారాణి, ఆయా విజయ, చిన్నారులు, వారి తల్లులు పాల్గొన్నారు.

## ఒడ్నాల జగన్మోహన్, ఒడ్నాల ఉదయ్ కుమార్ జ్ఞాపకార్థం విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలంలో పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు అవసరమైన పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు.నర్సింగాపూర్ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించిన ఒడ్నాల జగన్మోహన్, ఒడ్నాల ఉదయ్ కుమార్ జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్, పౌచ్, హాల్ టికెట్ కవర్లు, పెన్నులు, పెన్సిల్స్, స్కేలు తదితర పరీక్షా సామగ్రిని మండల విద్యాధికారి చేతుల మీదుగా బోయినిపల్లి మోడల్ స్కూల్‌లో అందజేశారు.ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రఘునాథ్, ఉపాధ్యాయులు,ఇతరులు పాల్గొన్నారు.

## నేతాజీ ఆశయాలు యువతకు మార్గదర్శకం

- విద్యార్థుల్లో దేశభక్తి చైతన్యం కోసం వ్యాసరచన పోటీలు దోహద పడుతాయి
- యువజన సంఘాల జిల్లా నాయకులు : అమిరిశెట్టి భూమిరెడ్డి
- విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించాలి
- వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్రాధ్యక్షులు : అతికం రాజశేఖర్ గౌడ్
- నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు
- విజేతలకు బహుమతులు ప్రధానం



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని మల్కాపూర్ గ్రామంలో నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం "భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ పాత్ర" అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన యువజన సంఘాల జిల్లా అధ్యక్షులు అమిరిశెట్టి భూమిరెడ్డి, తెలంగాణ వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యానికి నేతాజీ సుభాష్ చంద్రబోస్ చేసిన సేవలు అపారమని పేర్కొన్నారు. దేశభక్తి, త్యాగం, ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిచిన నేతాజీ జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.నేటి తరానికి స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను పరిచయం చేయడం ఎంతో అవసరమని, విద్యార్థుల్లో దేశభక్తి భావన పెంపొందించేందుకు ఇలాంటి వ్యాసరచన పోటీలు ఉపయోగపడతాయని తెలిపారు. చదువుతో పాటు సమాజం పట్ల బాధ్యతతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టు యూనియన్ జిల్లా నాయకులు గడ్డం తిరుపతి, వంశీ,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## గ్లామర్‌తో గత్తర లేపిన

# అప్సర రాణి..

### ఆర్జీవీ ఫేవరెట్ హీరోయిన్ ఇప్పుడు ఎక్కడుంది?

సినీ పరిశ్రమలో చాలామంది హీరోయిన్లు ప్రారంభంలో మంచి జోరు చూపించి తర్వాత క్రమంగా సినిమాలకు దూరమవడం సహజమే. కొంతమంది పెళ్లి చేసుకుని ఇండస్ట్రీకి గుడ్‌బై చెబుతుంటే, మరికొందరు అవకాశాలు తగ్గడంతో మెల్లగా తెరపై కనిపించకుండా పోతారు. ఇలాంటి హీరోయిన్లలో ఒకరు అప్సర రాణి. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫోటోలలో కనిపిస్తున్న ఈ బ్యూటీని చాలా మంది వెంటనే గుర్తుపట్టలేకపోయినా, ఒకప్పుడు ఆమె యువతలో మంచి క్రేజ్ సంపాదించింది. తన అందం, గ్లామర్‌తో కుర్రకారును ఆకట్టుకున్న అప్సర రాణి కొంతకాలం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా నిలిచింది.అప్సర రాణి అసలు పేరు అంకేత మహారాణా. అయితే సినీ రంగంలోకి వచ్చిన తర్వాత ఆమె అప్సర రాణి అనే పేరుతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ముఖ్యంగా ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో వచ్చిన సినిమాలతో ఆమెకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. అప్సర రాణి హీరోయిన్‌గా మొదటిగా '4 లెటర్స్' అనే సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. ఆ తర్వాత తెలుగు, హిందీ భాషల్లో పలు సినిమాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. ముఖ్యంగా బోల్డ్ పాత్రల్లో నటించడంలో ఆమె వెనుకాడకపోవడం వల్ల త్వరగా పాపులారిటీ పొందింది. ప్రత్యేకంగా రామ్ గోపాల్ వర్మ తెరకెక్కించిన 'డేంజర్' సినిమాలో ఆమె నటన ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ఆ సినిమాలో తన గ్లామర్‌తో పాటు నటనతో కూడా మంచి గుర్తింపు తెచ్చుకుంది. సినిమాలతో పాటు సోషల్ మీడియాలో కూడా అప్సర రాణి చాలా యాక్టివ్‌గా ఉంటుంది.

తరచూ తన ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ అభిమానులను అలరిస్తుంటుంది. ఆమె పోస్ట్ చేసే గ్లామర్ ఫోటోలు సోషల్ మీడియాలో తరచూ వైరల్ అవుతుంటాయి. అయితే ఒకప్పుడు వరుస అవకాశాలు అందుకున్న ఈ బ్యూటీకి ప్రస్తుతం పెద్దగా సినిమా ఆఫర్లు రావడం లేదని తెలుస్తోంది. కొన్ని ప్రాజెక్టులు చర్చల్లో ఉన్నప్పటికీ పెద్దగా సినిమాల్లో కనిపించకపోవడంతో అభిమానులు కూడా ఆమె రీఎంట్రీ కోసం ఎదురు చూస్తున్నారు. గ్లామర్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్న అప్సర రాణి మళ్లీ పెద్ద సినిమాలతో తిరిగి రావాలని అభిమానులు ఆశిస్తున్నారు. భవిష్యత్తులో ఆమెకు మంచి అవకాశాలు వస్తాయా లేదా అన్నది చూడాలి.


## చారిత్రక యోధురాలు

# సత్యవతి




కథానాయిక రీతూవర్మకు మంచి అవకాశాలైతే వస్తున్నాయి కానీ..ఆ మేరకు విజయాలు మాత్రం దక్కడం లేదు. అయితే నటనాపరంగా చక్కటి ప్రతిభాపాటవాల్ని ప్రదర్శిస్తూ కెరీర్‌లో రాణిస్తున్నది. తాజాగా ఈ భామ తెలుగులో భారీ ఆఫర్‌ను దక్కించుకుంది. అగ్ర హీరో గోపీచంద్ సరసన కథానాయికగా ఖరారైంది. సంకల్ప్ రెడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ పతాకంపై శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్నారు. 'గోపీచంద్ 33' అనే వర్కింగ్ టైటిల్‌తో హిస్టారికల్ మూవీగా తెరకెక్కుతున్నది. ఈ సినిమాలో రీతూవర్మ 7వ శతాబ్దానికి చెందిన సత్యవతి అనే చారిత్రక యోధురాలు పాత్రలో కనిపించనుంది. మంగళవారం రీతూవర్మ జన్మదినం సందర్భంగా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో ఆమె విల్లు ఎక్కుపెట్టి సమరానికి సిద్ధమన్నట్లుగా కనిపిస్తున్నది. తీక్షణమైన ఆమె చూపులు పాత్ర తాలూకు పవర్‌ను సూచిస్తున్నాయి. గిరిజన తెగ తాలూకు సంస్కృతి, ధైర్యాన్ని ప్రతిబింబించేలా ఆమె పాత్ర సాగుతుందని, రీతూవర్మ కెరీర్‌లోనే ఉత్తమ పాత్రగా నిలుస్తుందనే నమ్మకం ఉందని మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ఈ చిత్రానికి కెమెరా: సౌందర్‌రాజన్, దర్శకత్వం: సంకల్ప్ రెడ్డి.

## జైలర్-2లో పోలీస్‌గా?




అగ్ర హీరో రజనీకాంత్ కథానాయకుడిగా నెల్సన్ దర్శకత్వంలో రూపొందిన బ్లాక్‌బస్టర్ 'జైలర్' ఎంతటి విజయాన్ని సాధించిందో తెలిసిందే. అనేక సర్‌ప్రైజ్ ఎలిమెంట్స్‌తో, పలు క్యామియోలతో ప్రేక్షకులను మెస్మరైజ్ చేసిన సినిమా ఇది. ప్రస్తుతం ఈ సినిమా సీక్వెల్ కోసం సినీ అభిమానులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'జైలర్'లో మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్ చేసిన స్పెషల్ రోల్స్ సినిమా విజయంలో కీలక పాత్ర పోషించగా, ఈ 'జైలర్ 2'లో కూడా సరికొత్త క్యామియోలతో తెరపై సందడి చేయించనున్నారు దర్శకుడు నెల్సన్. ఇందులో మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్‌లతో పాటు బాలీవుడ్ బాద్‌షా షారుక్‌ఖాన్ కూడా నటించనున్నారు. మొన్నటివరకూ రూమర్ అనుకున్న ఈ వార్తపై రీసెంట్‌గా స్పష్టత వచ్చింది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో షారుక్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారట. కథలో కీలకంగా ఆయన పాత్ర ఉంటుందట. ఎస్.జె.సూర్య కాంబినేషన్‌లో ఆయన పాత్ర సాగుతుందని, రజనీకాంత్, షారుక్ కాంబినేషన్ సీన్స్ గూజ్‌బంప్స్ తెప్పిస్తాయని మేకర్స్ చెబుతున్నారు. ఈ పానిండియా సినిమా ప్రపంచవ్యాప్తంగా ఆగస్ట్ 14న విడుదల కానుంది.



## రవితేజ సినిమాలో కీలకంగా..

ఓ అరడజను హిందీ సినిమాల్లో ప్రస్తుతం భాగమై ఉన్నది ముంబయ్ సోయగం తమన్నా భాటియా. వీటిలో కీలక పాత్రల్లో నటిస్తున్న సినిమాలు కొన్నుంటే, ప్రత్యేక గీతాల్లో నర్తిస్తున్న సినిమాలు కొన్నున్నాయి. 'పురుషన్' అనే ఓ తమిళ సినిమాలో కూడా ఈ అందాలభామ నటిస్తున్నది. తెలుగులో నటించిన 'దటీజ్ మహాలక్ష్మి' సినిమా విడుదల కావాల్సివుంది. ఇదిలావుంటే.. తాజాగా టాలీవుడ్‌లో తెరకెక్కుతున్న ఓ ప్రస్టేజియస్ సినిమాలో కీ రోల్ పోషించేందుకు తమన్నా ఇటీవలే సైన్ చేసిందట. ఆ సినిమా మరేదోకాదు, రవితేజ కథానాయకుడిగా శివ నిర్వాణ దర్శకత్వంలో రూపొందుతున్న 'ఇరుముడి'. ఇప్పటివరకూ వచ్చిన రవితేజ సినిమాలకు భిన్నంగా, భావోద్వేగాలతో కూడిన ఓ వినూత్న కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రంలో రవితేజకు జోడీగా ప్రియా భవానీ శంకర్ నటిస్తుండగా, కథలోని కీలకమైన ఓ పాత్రకు తమన్నాను దర్శకుడు శివ నిర్వాణ ఎంపిక చేశారట. త్వరలోనే తమన్నా ఈ సినిమా సెట్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో రానుంది.ప్రతిష్టాత్మక మైత్రీమూవీమేకర్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం విదితమే.

## 'దేవర 2'కు ముహూర్తం ఖరారైందా?



పానిండియా బ్లాక్‌బస్టర్ 'ఆర్ఆర్ఆర్' తర్వాత తారక్ నుంచి వచ్చిన సినిమా 'దేవర'. రాజమౌళి సినిమా చేసిన హీరోకు వెంటనే హిట్ రావడం అసంభవం అనుకునే రోజుల్లో, ఆ సెంటిమెంట్‌ని బ్రేక్ చేసి, 500కోట్ల వసూళ్లు సాధించి, సోలో హీరోగా తారక్ కెరీర్‌లోనే వసూళ్ల పరంగా బెస్ట్‌గా నిలిచింది 'దేవర'. ఈ సినిమా సీక్వెల్ కోసం ఎన్టీఆర్ అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఎన్టీఆర్‌కు ఉన్న కమిట్‌మెంట్ల వల్ల ఈ సినిమా ఆలస్యం అవుతూవచ్చింది. అయితే.. ఎట్టకేలకు ఈ సినిమాపై నిర్మాత సుధాకర్ మిక్కిలినేని క్లారిటీ ఇచ్చారు. 'దేవర 2' రెగ్యులర్ షూటింగ్ మే నుంచి మొదలుకానున్నదని ఆయన తెలిపారు. ప్రస్తుతం తారక్ 'డ్రాగన్'(వర్కింగ్ టైటిల్) సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. దర్శకుడు ప్రశాంత్‌నీల్ తన గత చిత్రాల మాదిరిగానే ఈ సినిమాను కూడా రెండు భాగాలుగా తీస్తున్నాడని వినికిడి. త్వరితగతిన ఈ సినిమా షూటింగ్‌ని పూర్తి చేసి, మే నుంచి 'దేవర 2' సెట్‌లోకి తారక్ ఎంట్రీ ఇస్తారట. కథలో భారీగా మార్పులు జరిగాయని, షూటింగ్ షెడ్యూల్ కూడా ఫైనల్ అయ్యిందని, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని చిత్రబృందం చెబుతున్నది. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో సైఫ్ అలీఖాన్ విలన్‌గా కనిపించనున్న విషయం తెలిసిందే.

### ధ్యానంతో మానసిక, శారీరక

# సమస్యలు దూరం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఈరోజుల్లో చాలామంది ప్రజలు అనేక రకాలైన వ్యాధుల బారిన పడుతున్నారు. షుగర్ వ్యాధి, బిపి, థైరాయిడ్ లాంటివి సర్వసాధారణం అయిపోయాయి. ఎన్నో రకాల మెడిసిన్స్ వాడుతున్నారు. ఈ మెడిసిన్స్ వల్ల వచ్చే సైడ్ ఎఫెక్ట్స్ తో మరో కొత్త వ్యాధిని కొనితెచ్చుకుంటున్నారు. దత్తాత్రేయ స్వామి ఉపాసకులు శ్రీశ్రీశ్రీ దత్తావధూత కాలేజీ స్వామి శిష్యుడు అయినటువంటి మా గురువు శ్రీశ్రీశ్రీ నిత్యానంద సరస్వతి బాబా మహరాజు ఈ ఆరోగ్య సమస్యలకు ఎటువంటి మెడిసిన్ వాడకుండా వ్యాధిని పూర్తిగా నయం చేసుకునే మార్గాన్ని మీకు చూపించబోతున్నారు. ఎంతోమంది ప్రజల మానసిక, శారీరక సమస్యలను దూరం చేసి మన ముందుకు ఎన్నో వ్యాధులకు పరిష్కారంగా వచ్చారు. ఆయన సలహాలు సూచనలు తూచా తప్పకుండా పాటిస్తూ, 41 రోజుల్లో సంపూర్ణ ఆరోగ్యాన్ని, ఆనందాన్ని పొందగలరు. ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. ఆ మహాభాగ్యాన్ని మీరందరూ పొందాలని, ప్రపంచమంతా ఆరోగ్యవంతులుగా మార్చాలని ఆ సంకల్పానికి మీ సహకారం అందించాలని కోరుకుంటున్నాము. మీకు ఎటువంటి వ్యాధులు ఉన్న వాటికి పరిష్కారాన్ని చూపగలము. మీరందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులు అవ్వాలని ఆశీర్వదిస్తున్నాము. ఆ దత్తాత్రేయ స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ మీపై కలుగుగాక. సర్వే జన సుఖినోభవంతు సమస్త లోకాన్ సన్మంగళంభవంతు

# మంథని వాసికి అరుదైన గౌరవం

**- డాక్టర్ ప్రియాంకకు ఘనంగా సన్మానం**



**మంథని ( ప్రశ్న న్యూస్)** అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మంథని కి చెందిన డాక్టర్ రామడుగు ప్రియాంక ను బుధవారం ఘనంగా సన్మానించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వారు ఈ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. చర్మ వ్యాధి నిపుణురాలుగా మంచి గుర్తింపు పొందిన ప్రియాంకను ఉత్తమ వైద్యురాలుగా గుర్తించి ఈ ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రియాంక తండ్రి రిటైర్డ్ ప్రభుత్వ ప్రధాన ఉపాధ్యాయులుగా మంచి పేరు తెచ్చుకున్నారు. స్థానిక మార్గదర్శి పాఠశాలలో చురుకైనా విద్యార్థినిగా ప్రియాంక మంచి మార్కులతో ఉత్తీర్ణురాలై మెడిసిన్ లో సీటు సంపాదించారు. అనంతరం వైద్యవృత్తిలో స్థిరపడి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ప్రియాంకకు ఉత్తమ వైద్యులుగా అవార్డు రావడంపై స్థానికంగా ప్రశంసలు వ్యక్తం అవుతున్నాయి.

### మంథని బాలికల ఉన్నత పాఠశాలలో

# ఘనంగా వీడ్కోలు సమావేశం



**మంథని ( ప్రశ్న న్యూస్)** మంథని బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఏర్పాటుచేసిన వీడ్కోలు సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమలత మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో నిలవాలని పిలుపునిచ్చారు. సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా కర్తవ్యాన్ని నిర్వహించాలని ఉన్నత స్థాయిలోని పదవులలో ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులే నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### స్వప్న స్వదేశ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో

# ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రం ప్రారంభం



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, రామన్నపేట గ్రామంలో స్వప్న స్వదేశ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత నైపుణ్య అభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సంస్థ నిర్వాహకురాలు డాక్టర్ స్వప్నరావు తెలిపారు. మొదటి బ్యాచ్‌లో 20 మంది మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. శిక్షణ కేంద్రాన్ని రామన్నపేట గ్రామ సర్పంచ్ కవిత - వెంకట్ రెడ్డి, స్తంభంపల్లి సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్,వర్ధవెల్లి సర్పంచ్ చల్లా శ్రీనివాస్ రెడ్డి కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ మహిళల అభివృద్ధికి ఉచిత శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సంస్థ నిర్వాహకురాలు డాక్టర్ స్వప్నరావును అభినందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శిక్షణ పొందనున్న మహిళలకు యూనిఫామ్‌లు, టూల్ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి,మాజీ ఉప సర్పంచ్‌లు రాములు, భూమయ్య,సుధాకర్ రెడ్డి, అనీల్ రెడ్డి, మెరుపుల మహేష్,సతీష్,వేణు, కె మహేష్,కిషన్,నాగార్జున్, సురేష్,శ్రీను,అనిల్, సంస్థ వాలంటీర్లు పాల్గొన్నారు.

# ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ

- ఇంధన రవాణాకు ఆటకు కలకుండా అమెరికా వ్యూహం
- మధ్య ప్రాచ్యంలో ముదురుతున్న యుద్ధం
- ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం
- హోర్ముజ్ జల సంధిలో ఉద్రిక్తతలు
- ప్రపంచ వాణిజ్యానికి తీవ్ర విఘాతం
- ఈ జల సంధి ద్వారా 97 శాతం పడిపోయిన నౌకల రాకపోకలు
- ఎల్ ఎన్ జి, ఎరువులు ఈ మార్గం ద్వారానే రవాణా
- ప్రతిరోజు 20 మిలియన్ బ్యారెళ్ళ చమురు ఈ మార్గం ద్వారానే రవాణా
- అందులో 84 శాతం ఆసియా దేశాలకే



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్ )**పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు కేవలం ఆ ప్రాంతానికే పరిమితం కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధిలో తలెత్తిన ఉద్రిక్తతలు ప్రపంచ వాణిజ్యానికి ఉరితాడుగా మారే ప్రమాదం ఉందని ఐక్యరాజ్యసమితి జారీ చేసిన తాజా హెచ్చరిక ఇప్పుడు పెను సంచలనంగా మారింది. ఇజ్రాయెల్-అమెరికా దాడులు, దానికి ప్రతిగా ఇరాన్ ప్రతీకార చర్యలతో ప్రపంచంలోనే అత్యంత కీలకమైన ఈ సముద్ర మార్గం గుండా నౌకల రాకపోకలు ఏకంగా 97 శాతం పడిపోవడం ఒక భయంకరమైన వాస్తవాన్ని కళ్లకు కడుతోంది.హోర్ముజ్ జలసంధి అనేది కేవలం ఒక నీటి మార్గం కాదు, అది ప్రపంచానికి శక్తినిచ్చే 'ధమని'. ప్రపంచ చమురు వాణిజ్యంలో నాలుగో వంతు, గణనీయమైన మొత్తంలో ఎల్ఎన్‌జీ, ఎరువులు ఈ సన్నని జలసంధి ద్వారానే రవాణా అవుతాయి. యూఎన్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ నివేదిక ప్రకారం, ఈ మార్గంలో అంతరాయం కలగడం అంటే ప్రపంచవ్యాప్తంగా ఇంధనం, రవాణా, ఆహార ధరలు,ఆకాశాన్ని తాకడమే. చమురు ధరలు పెరిగితే రవాణా ఖర్చులు పెరుగుతాయి, గ్యాస్ ధరలు పెరిగితే ఎరువుల ధరలు పెరుగుతాయి, వెరసి ఇవన్నీ కలిసి సామాన్యుడి కంచంలోని ఆహార ధరలను పెంచి, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రజల జీవనాన్ని దుర్భరం చేస్తాయి.అంకెలు చూస్తే పరిస్థితి తీవ్రత అర్థమవుతుంది. రోజుకు సుమారు 20 మిలియన్ బ్యారెళ్ల చమురు ఈ మార్గం గుండానే వెళ్లాలి. అందులో 84 శాతం ఆసియా దేశాల అవసరాలకే ఉద్దేశించబడింది. అంటే, ఈ జలసంధి మూతపడితే ఆసియా ఖండంలోని ఇంధన భద్రత కుప్పకూలే ప్రమాదం ఉంది. ఒక వారం ముందు వరకు ఈ మార్గం గుండా వెళ్లిన భారీ నౌకలు, దాడులు ప్రారంభమైన నాటి నుంచి కనిపించకుండా పోయాయి. బీమా ప్రీమియంలు పెరగడం, ఓడల రాకపోకలకు ముప్పు ఉండటంతో సరఫరా గొలుసు పూర్తిగా ఛిన్నాభిన్నమైంది.అప్పుల భారంతో కునారిల్లుతున్న అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఈ 'ప్రైస్ షాక్' కోలుకోలేని దెబ్బ కానుంది. ఇప్పటికే ఆర్థిక వనరులు లేక ఇబ్బంది పడుతున్న ప్రభుత్వాలపై, గృహ బడ్జెట్‌లపై ఈ ధరల పెరుగుదల అదనపు ఒత్తిడిని పెంచుతుందని యు ఎన్ సి టీ ఏడి హెచ్చరించింది. అంతర్జాతీయ చట్టాలను గౌరవిస్తూ, నావిగేషన్ స్వేచ్ఛను పునరుద్ధరించకపోతే, ఈ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ప్రపంచాన్ని మరో భారీ ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదు. ఉద్రిక్తతలు తగ్గించి, సురక్షిత వాణిజ్య మార్గాలను కాపాడటమే ఇప్పుడు ప్రపంచ దేశాల ముందున్న తక్షణ కర్తవ్యం.ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ కూటమి మధ్య యుద్ధం 12వ రోజుకు చేరుకుంది. బుధవారం తెల్లవారుజామున ఇరాక్ రాజధాని బాగ్దాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోని అమెరికా దౌత్య మద్దతు కేంద్రం ( బీడీఎస్సీ )పై డ్రోన్ల దాడి జరిగింది. మొత్తం ఆరు డ్రోన్లు ఈ కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకోగా, ఐదింటిని అమెరికా రక్షణ వ్యవస్థలు గాలిలోనే కూల్చివేశాయి. అయితే, ఒక డ్రోన్ మాత్రం కార్యాలయ ప్రాంగణాన్ని తాకడంతో స్వల్ప నష్టం వాటిల్లింది. ఈ దాడిలో ఎవరికీ గాయాలు కాలేదని ప్రాథమిక సమాచారం.బుధవారం సూర్యోదయానికి ముందే ఇరాన్ తన క్షిపణి ఛత్రాన్ని విప్పింది. ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్, హైఫా నగరాలను లక్ష్యంగా చేసుకుని భారీగా క్షిపణులను ప్రయోగించింది. అలాగే, బహ్రెయిన్‌లోని అమెరికా ఐదో నావికా దళానికి చెందిన స్థావరంపై కూడా ఇరాన్ దాడులు చేసినట్లు అక్కడి మీడియా వెల్లడించింది. దీనికి ప్రతిగా అమెరికా, ఇజ్రాయెల్ దళాలు ఇరాన్ అంతటా భీకరమైన వైమానిక దాడులను కొనసాగిస్తున్నాయి.యుద్ధం ఆపకపోతే గల్ఫ్ నుంచి ప్రపంచ దేశాలకు వెళ్లే చమురు రవాణాను పూర్తిగా అడ్డుకుంటామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ (ఐ ఆర్ జి సి ) హెచ్చరించింది. హార్ముజ్ జలసంధిలో మైన్లను (మందుపాతరలు) అమర్చి షిప్పింగ్‌ను నిలిపివేసేందుకు ఇరాన్ యత్నిస్తోంది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రస్థాయిలో స్పందించారు. ఒకవేళ చమురు సరఫరాను ఇరాన్ అడ్డుకుంటే, ఎన్నడూ చూడని రీతిలో ప్రతీకారం ఉంటుందని హెచ్చరించారు.చమురు మార్గంలో మైన్లను అమర్చేందుకు సిద్ధంగా ఉన్న ఇరాన్‌కు చెందిన 16 నౌకలను అమెరికా నావికా దళం ఇప్పటికే ధ్వంసం చేసింది. ఇంధన సరఫరాకు ఎటువంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'లో భాగంగా అమెరికా ఈ చర్యలు చేపట్టింది. ప్రస్తుతం పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు గరిష్ఠ స్థాయికి చేరడంతో అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతున్నాయి. మరోవైపు ఇజ్రాయెల్‌తో సంబంధం ఉన్న అమెరికా టెక్ కంపెనీల మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయాలని ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్జీసీ) నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇరాన్‌పై దాడి కోసం ఈ సంస్థల సాంకేతికతను ఉపయోగిస్తున్నందున వీటిని లక్ష్యంగా చేసుకున్నట్లు ఐఆర్జీసీ అనుబంధ వార్తా సంస్థ తస్నిం న్యూస్ ఏజెన్సీ తెలిపింది.

ప్రముఖ సెర్చింజన్ సంస్థ గూగుల్, మైక్రోసాఫ్ట్, ఐబీఎం, ఎన్‌విడియా, ఒరాకిల్, పాలంటీర్ వంటి టెక్ సంస్థలు, గల్ఫ్ దేశాల్లో క్లౌడ్ ఆధారిత సేవలు అందిస్తున్న కొన్ని కార్యాలయాలు ఈ జాబితాలో ఉన్నట్లు తెలిపింది. అమెరికా, ఇజ్రాయెల్‌లకు సంబంధించిన బ్యాంకులు, ఆర్థిక సంస్థలను లక్ష్యంగా చేసుకుంటామని పేర్కొంది. ఇందుకోసం శత్రువులు తమకు స్వేచ్ఛ కల్పించారని అన్నారు. ఆయా ప్రదేశాలకు ఒక కిలోమీటరు పరిధిలో ప్రజలు ఉండవద్దని ఇరాన్ హెచ్చరించింది. యుద్ధంలో గాయపడినట్లు అంగీకరించిన ఇరాన్ ప్రభుత్వ మీడియా

పాత ఫొటోలు, ఏఐ చిత్రాలతో నెట్టుకొస్తున్న ప్రభుత్వ ఛానళ్లు ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన మొజ్తబా ఖమేనీ ఆచూకీపై తీవ్ర గందరగోళం నెలకొంది. ఆయన అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒక్కసారి కూడా ప్రజల ముందుకు రాకపోవడం, కనీసం ఒక ప్రకటన కూడా విడుదల చేయకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. కొనసాగుతున్న యుద్ధంలో ఆయన గాయపడ్డారని వార్తలు వస్తున్నప్పటికీ, ప్రభుత్వం నుంచి స్పష్టత కొరవడటంతో ఆయన పరిస్థితిపై రకరకాల ఊహాగానాలు వెలువడుతున్నాయి.

సోమవారం ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ మొజ్తబా గాయపడినట్లు అంగీకరించింది. ఆయన్ను "జాన్‌బాజ్ ఆఫ్ రంజాన్" (గాయపడిన యుద్ధ వీరుడు) అని అభివర్ణించింది. అయితే, ఈ గాయం ఎప్పుడు, ఎక్కడ, ఎలా తగిలింది, దాని తీవ్రత ఎంత అనే వివరాలను మాత్రం వెల్లడించలేదు. ఈ గాయం కారణంగా ఆయన తన అధికారిక బాధ్యతలను నిర్వర్తించగలుగుతున్నారా? లేదా? అనే విషయంపై కూడా స్పష్టత ఇవ్వలేదు. దీంతో మిస్టరీ మరింత పెరిగింది.జెరూసలేం పోస్ట్ తన కథనం ప్రకారం అంతర్గత వర్గాల సమాచారం మేరకు మొజ్తబా యుద్ధంలో గాయపడింది నిజమే అయినప్పటికీ, ఆయన దేశ వ్యవహారాలను చక్కదిద్దే స్థితిలోనే ఉన్నారని తెలుస్తోంది.

అయినప్పటికీ, నాయకత్వ మార్పు సజావుగా జరిగిందని ప్రభుత్వ అధికారులు చెబుతున్నా, ఇప్పటివరకు మొజ్తబాకు సంబంధించిన ఒక్క కొత్త ఫొటో గానీ, వీడియో గానీ విడుదల కాలేదు. ప్రభుత్వ ఛానళ్లు ఆయన పాత ఫుటేజ్‌ను, కొన్ని సందర్భాల్లో ఏఐ-జెనరేటెడ్ చిత్రాలను ఉపయోగించి అంతా సవ్యంగా ఉందని చూపించే ప్రయత్నం చేస్తున్నాయి.ఈ పరిణామాలపై ఇరాన్ ప్రభుత్వ వ్యతిరేకులు, పరిశీలకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొజ్తబా ప్రజల ముందుకు రాకపోవడం వెనుక బలమైన కారణం ఉందని వారు అనుమానిస్తున్నారు. సోషల్ మీడియాలో కొందరు ఆయన గాయాలతో మరణించి ఉండవచ్చని కూడా ప్రచారం చేస్తున్నారు. ప్రస్తుతం దేశాన్ని నడిపిస్తున్నది ఎవరు? తెర వెనుక నిజమైన అధికారం ఎవరి చేతిలో ఉంది? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మొజ్తబాను కేవలం ఒక ఉత్సవ విగ్రహంగా ఉంచి, పాలనా వ్యవస్థలోని మరో సీనియర్ అధికారి అధికారాన్ని చెలాయిస్తున్నారని ప్రతిపక్ష వర్గాలు ఆరోపిస్తున్నాయి. దశాబ్దాల పాటు ఇరాన్ రాజకీయాలను శాసించిన సుప్రీం లీడర్ అలీ ఖమేనీ కుమారుడే ఈ మొజ్తబా ఖమేనీ. ఆయనకు అధికారిక పదవులు లేనప్పటికీ, తెరవెనుక దేశ రాజకీయ, భద్రతా వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించారని విశ్లేషకులు భావిస్తారు.

## విశాల్, నవ్య రిసెప్షన్ కు పలువురు ప్రముఖులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.




# కృష్ణానదిలో ఇద్దరు బాలురు గల్లంతు

**సూర్యాపేట** సూర్యాపేట జిల్లాలో ఆందోళనకర ఘటన చోటు చేసుకుంది. హుజూర్ నగర్ నియోజకవర్గంలోని చింతలపాలెం మండలం చింత్రియాల గ్రామానికి చెందిన ఇద్దరు బాలురు కృష్ణా నదిలో గల్లంతయ్యారు.. చేపల వేట కోసం నదికి వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది.సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులు కలిసి నదిలో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు.అయితే బాలురు ఎలా గల్లంతయ్యారు? వారి పరిస్థితి ఏమిటి? అనే అంశాలపై ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.ఘటనతో గ్రామంలో ఆందోళన నెలకొంది.

# ఒంగోలులో ఆటో డ్రైవర్ నిజాయితీ..

**- రూ.30 లక్షల బంగారం అప్పగింత..**

**ఒంగోలు** ప్రకాశం జిల్లా ఒంగోలులో ఓ ఆటో డ్రైవర్ తన నిజాయితీని చాటుకున్నారు. ప్రయాణికులు ఆటోలో మర్చిపోయిన సుమారు రూ.30 లక్షల విలువైన బంగారు ఆభరణాలను పోలీసులకు అప్పగించి ఆదర్శంగా నిలిచారు. ఈ ఘటనతో ఆటో డ్రైవర్పై ప్రశంసల వర్షం కురుస్తోంది. వివరాల్లోకి వెళితే.. విజయవాడకు చెందిన సుబ్బారావు తన కుటుంబంతో కలిసి ఒంగోలు వచ్చారు. ఈ క్రమంలో ఓ ఆటో ఎక్కి గమ్యస్థానంలో దిగారు. అయితే, హడావిడిలో రూ.30 లక్షల విలువైన బంగారు నగలు ఉన్న బ్యాగును ఆటోలోనే మర్చిపోయారు. కాసేపటికి విషయం గుర్తించిన సుబ్బారావు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు.మరోవైపు ప్రయాణికులు దిగి వెళ్లిన తర్వాత ఆటో డ్రైవర్ నాగేశ్వరరావు తన వాహనంలో బ్యాగును గమనించారు. అది తన ఆటోలో ప్రయాణించిన వారిదేనని భావించి, వారి కోసం సమీప ప్రాంతాల్లో వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో నేరుగా ఒంగోలు వన్ టౌన్ పోలీస్ స్టేషన్కు వెళ్లి బ్యాగును పోలీసులకు అప్పగించారు.పోలీసులు బ్యాగును తెరిచి చూడగా అందులో బంగారు ఆభరణాలు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే సుబ్బారావుకు సమాచారం ఇచ్చి, నగలను ఆయనకు అప్పగించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు.. పోలీస్ పరేడ్ గ్రౌండ్లో జరిగిన కార్యక్రమంలో నాగేశ్వరరావు నిజాయితీని మెచ్చి సత్కరించారు. ఇదే తరహాలో మరో ఘటనలో ప్రయాణికులు మర్చిపోయిన బంగారాన్ని అప్పగించిన ఆటో డ్రైవర్ ఖలీల్ను కూడా ఎస్పీ అభినందించారు.

### తుషార్ గాంధీ మాట కూడా వినకుండా

# కూల్చివేతలు

**హైదరాబాద్** మహాత్మా గాంధీ మనవడు తుషార్ గాంధీ విగ్రహం మాకు అవసరంలేదని చెబుతున్నా కూడా వినకుండా రేవంత్ రెడ్డి పేదల ఇల్లు కూల్చుతున్నాడని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు.వెలుగుమట్ల గాజా అయినట్లు రేపు తెలంగాణ మొత్తం గాజా అవబోతుంది . రాజేంద్రనగర్ మానస హిల్స్ లో ఎలాంటి అనుమతులు లేకుండా కొండలను పిండి చేస్తూ.. మళ్లీ సిగ్గులేకుండా రాత్రికిరాత్రికి పేరు మీద పెయింట్ వేసి మాకు సంబంధం లేదని మంత్రి పొంగులేటి చెబుతున్నాడు.ఈయన మళ్లీ వెలుగుమట్ల పేద ప్రజలను పెయిడ్ బ్యాచ్, ల్యాండ్ మాఫియా అంటున్నాడని అన్నారు.

# బోయిన్ పల్లి మార్కెట్ లో

# చెత్తకి,గంగయ్య బస్తీ సుస్తీ

**- గంగయ్య బస్తీ పెద్దలు చెత్త పై చిర్రు బుర్రు.దుర్గంధపు వాసన,మురుగు నీరు ఆగేది ఎలా**

**- బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లన ఎక్కడేసిన గొంగళి అక్కడే**

**- స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ దృష్టికి తీసుకెళ్లి ఐదు రోజులు గడిచిన న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న బస్తీ వాసులు**

**- ఓ పక్క "35"ఏళ్ల ఇంటి కప్పు ఊడుతుంటే,మరోవైపు**

**- "2"నెలలుగా మార్కెట్ చెత్తతో బక్కచిక్కిన బతుకుల్లో నీరసం వస్తుందని వయస్సు మీద పడ్డ అమ్మల కన్నీటి గాథలు**



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ మహానగరంలో జిహెచ్ఎంసి శానిటేషన్ సిబ్బంది కాలనీలు,బస్తీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తుంటారు.కొన్ని ప్రాంతాల్లో రోడ్లు పై చెత్త కుండీలు వద్ద భారీగా చెత్త,రహదారులు పై మురుగు నీరు పారిన ఒక్క ఫోన్ కాల్ తో చర్యలు చేపడుతారు మున్సిపల్ అధికారులు.అదే సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో చెత్త చెదారంతో పేరుకు పోతున్న పట్టించుకునే నాథుడే ఉండడు.కాలనీలు, బస్తీలు,రహదారులు పై అక్కడక్కడా చెత్త కుప్పలు కన్పిస్తున్నాయి. ఇక ఈ రెండింటికీ అతీతంగా మరో విభాగంలో నిత్యం చెత్త కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి.ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్ అయిన డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్.దీన్ని వార్షిక ఆదాయం సుమారు పద్నాలుగు కోట్లు పై మాటే !ప్రతి రోజూ మార్కెట్ కి సుమారు ఇరవై ఎనిమిది టన్నుల కూరగాయలు దిగుమతి అవుతున్నాయని విశ్వసనీయ సమాచారం.అదేవిధంగా ఒకటి రెండు రోజులు కన్న ఎక్కువ దినాలు నిల్వ ఉండని కూరగాయలు చెత్తకుప్పలో తెప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి.అయితే
గత ఐదు నెలలుగా మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు గుత్తేదారినికి బకాయిలు విడుదల చేయక కృత్రిమ ఇబ్బందులకు తెర లేపారు.కానీ అక్కడ సర్కార్,ఇక్కడ మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు బాగున్నారు. నలిగిపోతుందిబోయిన్ పల్లి మార్కెట్ అధికారులు, గుత్తేదారులు.వీరికి తోడు మార్కెట్ కి చూట్టు పక్కల ప్రాంతాల్లో ఉన్న ప్రజలు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారు.వీరే కాదు మార్కెట్ లో విధులు నిర్వహిస్తున్న కమీషన్ ఏజెంట్లు,గుమాస్తాలు, హమాలీలు, ఖరీదు దారులు,స్థానిక ప్రజలు అధికారులు, సర్కార్ పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికితోడు మార్కెట్ లో పశువులు సంచారంతో నయా సమస్య మొదలైంది.మరో విషయం ఏమిటంటే బోయిన్ పల్లి మార్కెట్ కి ఆనుకొని ఉన్న "గంగయ్య బస్తీ"వాసులు ప్రతి రోజూ మార్కెట్ నుంచి వెలువడే దుర్వాసన రావడంతో పలు రుగ్మతలకు గురౌతున్నారు. రాత్రి సమయంలో కుటుంబ సభ్యులతో భోజనం చేసేటప్పుడు ముక్కు పుటాలు పగిలే విధంగా వాసన రావడంతో తినే ఆహారం కూడా సహించడం లేదని,ఉదయం పిల్లలు, పెద్దలు బయటకు వెళ్తే ఆనందంగా ఉంటారు. తిరిగిగూటికి చేరే సరికి "డంపింగ్ యార్డ్ పక్కనే ఉన్నట్టు ఉంటుంది మా సమస్య అంటున్నారు.గత నాలుగు రోజుల నుంచి అయితే పరిస్థితి మరింత తీవ్రంగా నెలకొందని భావోద్వేగంతో మాట్లాడారు.ఈ మధ్య స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ బస్తీ పర్యటనలో స్థానికులు ఆయన దృష్టికి కూడా తీసుకెళ్లారు.త్వరలో చెత్త సమస్య పరిష్కారం అవుతుందని ఆయన హామీ ఇచ్చారు.కానీ ఇప్పటికీ చెత్త సమస్య ఎక్కడేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు మా ఇంటి పైకప్పు ఎక్కితే గానీ నలుగురికి తెలియదు.
అదిగాక గత ఏడాది బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ సెక్రటరీ కూడా చెత్త పై లేఖ అందజేసిన కూడా సమస్య పెద్దదైందే తప్ప పరిష్కారం మాత్రం లభించలేదని బస్తీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు.మార్కెట్ అధికారులు రాబోయే రెండు రోజుల్లో చెత్త తొలగించకపోతే "గంగయ్య బస్తీ వాసులు"భవిష్యత్తు కార్యాచరణ త్వరలో ప్రకటిస్తామని బస్తీ పెద్దలు తెలిపారు.
మార్కెట్ వాహనల పార్కింగ్ తో నిత్యం గొడవలు: డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ కమీషన్ ఏజెంట్లు,గుమాస్తాలు





తదితరులు గంగయ్య బస్తీ ప్రధాన రహదారిపై అడ్డుగోలుగా వాహనాలు నిలుపడంతో ప్రతి రోజూ బస్తీ వాసులకు మార్కెట్ వ్యక్తులకు గొడవలు జరుగుతున్నాయి.బస్తీలో ఏమైనా అత్యవసర సమయాల్లో అంబులెన్స్ వాహనం బస్తీ లోపలికి రావాలంటే అడ్డుగోలు కార్ల పార్కింగ్ తో నరకం చూస్తున్నామని మహిళలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.
ఉదయం పూట స్కూల్ పిల్లలు,ఆఫీస్ లకు వెళ్లే పెద్దలు సైతం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.గత కొంతకాలంగా ఎదురౌతున్న ఈ సమస్యకి ఎవ్వరూ పరిష్కారం చేయట్లేదని, అలాగే బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు దృష్టికి తీసుకెళ్లిన కూడా ఎం న్యాయం జరగలేదని బస్తీ పెద్దలు తెలిపారు.

# దీక్ష విరమించిన

## తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

**- నిమ్మరసం ఇచ్చి విరమింపజేసిన బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత నిరవధిక దీక్షకు దిగిన విషయం తెలిసిందే. ప్రభుత్వం నుంచి వెలుగుమట్ల బాధితులకు హామీ వచ్చిన నేపథ్యంలో ఆమె తన దీక్షను సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విరమించారు. కవితతో పాటు ధర్మ సమాజ్ పార్టీ అధినేత విశారదన్ మహారాజ్ కూడా దీక్షను విరమించారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప జేశారు. వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కవిత ఖమ్మంలో సోమవారం రాత్రి నిరవధిక దీక్షను చేపట్టారు. పోలీసులు ఆమెను అడ్డుకుని హైదరాబాద్‌కు తరలించగా, నగరంలో ఆమె దీక్షను కొనసాగించారు.వెలుగుమట్ల భూదాన్ భూమిలో అర్హులకు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పంపిణీ చేశారు. వెలుగుమట్ల పేదలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. 412 మందిని అధికారికంగా గుర్తించి, పట్టాలు ఇచ్చి న్యాయం చేస్తున్నామని అన్నారు. పట్టాలు పొందిన వారు నేటి నుంచి తమ ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలని కూడా ధైర్యం చెప్పారు. వెలుగుమట్ల అంశంపై ప్రభుత్వం స్పందించడంతో కవిత దీక్ష విరమించారు. దీక్ష విరమణ సందర్భంగా కవిత మాట్లాడుతూ, తమ పోరాటం ఆగలేదని, కేవలం విరామం మాత్రమే అన్నారు. వెలుగుమట్ల బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని అన్నారు. మన ఆందోళనలు, వెలుగుమట్ల ఆడపడుచుల నిరసనలతో ప్రభుత్వం దిగి వచ్చిందని అన్నారు.

# ఇరాన్‌తో యుద్ధం నేనెప్పుడు అనుకుంటే అప్పుడే ఆగిపోతుంది

**- యాక్సియోస్ ఇంటర్వ్యూలో ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు**




న్యూయార్క్ (ప్రశ్న న్యూస్) అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. నేను ఎప్పుడు అనుకుంటే అప్పుడు యుద్ధం ఆగుతుందని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లో అన్ని లక్ష్యాలను ఛేదించామని ఆయన వెల్లడించారు. ఇరాన్ వద్ద ఇంకా ఏమీ మిగలలేదని అన్నారు. ఇరాన్‌తో త్వరలో యుద్ధం ముగుస్తుందని వ్యాఖ్యానించారు. యాక్సియోస్‌తో ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, నేను ఎప్పుడు యుద్ధం ముగియాలనుకుంటే అప్పుడే ముగుస్తుందని అన్నారు. తమ ఆపరేషన్‌లో ఇరాన్ లక్ష్యాలను అన్నింటిని ఛేదించామని అన్నారు. మరోవైపు, ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ అంతకుముందు రోజు చేసిన వ్యాఖ్యలు విరుద్ధంగా ఉన్నాయి. అవసరమైనంత వరకు, తమ లక్ష్యాలను సాధించే వరకు యుద్ధం కొనసాగుతుందని కాట్జ్ తెలిపారు. ఈ ఆపరేషన్‌ను ఇంత సమయంలో ముగించాలనే కాలపరిమితి ఏదీలేదని తెలిపారు.

# నాటు కోడి ముద్దు..

# బాయిలర్ కోడి వద్దు

## - ప్లేట్‌లోకి వస్తున్న చికెన్ ఆరోగ్యవంతమేనా.?

**(గౌటీ బాల సాయి తిలక్ - ప్రశ్న న్యూస్)**





భారతదేశం వంటి వ్యవసాయ ఆధారిత దేశంలో కోళ్ల పెంపకం ఒక ముఖ్యమైన ఉపాధి వనరుగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఒకప్పుడు ప్రతి ఇంట్లోనూ కొన్ని నాటుకోళ్లు ఉండటం సాధారణం. ఇంటి ఆవరణలో తిరుగుతూ, సహజ ఆహారం తీసుకుంటూ పెరిగే ఈ కోళ్లు కుటుంబ ఆహార భద్రతలో కీలక పాత్ర పోషించేవి. కాలక్రమేణా పట్టణీకరణ, పెరుగుతున్న జనాభా, మాంసాహార వినియోగం పెరగడం వంటి కారణాలతో బాయిలర్ కోడి వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందింది. తక్కువ సమయంలో ఎక్కువ మాంసం ఉత్పత్తి చేయగలగడం వల్ల బాయిలర్ కోడి మార్కెట్‌ను ఆక్రమించింది. అయితే ఆరోగ్యంపై అవగాహన పెరుగుతున్న కొద్దీ నాటుకోడి మళ్లీ ప్రజల దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ నేపథ్యంలో నాటుకోడి మరియు బాయిలర్ కోడి మధ్య తేడాలు, వాటి పెంపకం విధానం, ఆరోగ్య ప్రయోజనాలు, ప్రజల్లో ఉన్న అనుమానాలు, హార్మోన్ల ప్రభావం వంటి అంశాలపై సమగ్రంగా తెలుసుకోవడం అవసరం.

### - నాటుకోడి అంటే ఏమిటి.?

నాటుకోడి లేదా దేశీ కోడి అనేది స్థానికంగా పెరిగే కోడి జాతి. ఇవి సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో స్వేచ్ఛగా తిరుగుతూ పెరుగుతాయి. పురుగులు, గింజలు, గడ్డి, ధాన్యాలు వంటి సహజ ఆహారాన్ని తీసుకుంటాయి. ఈ కారణంగా వీటి ఎదుగుదల నెమ్మదిగా ఉంటుంది. సాధారణంగా నాటుకోడి పూర్తిగా పెరగడానికి నాలుగు నుండి ఆరు నెలల వరకు సమయం పడుతుంది. నాటుకోడి మాంసం గట్టిగా ఉండి ప్రత్యేకమైన రుచిని కలిగి ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో నాటుకోడి కూరను ఆరోగ్యకరమైన ఆహారంగా భావిస్తారు. జలుబు, బలహీనత వంటి సందర్భాల్లో నాటుకోడి సూప్ తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదని పెద్దలు చెబుతుంటారు.

### - సహజ పెంపకం -- నాటుకోడి ప్రత్యేకత

నాటుకోడి పెంపకం విధానం సహజ ప్రకృతికి దగ్గరగా ఉంటుంది. ఇవి ఎక్కువగా స్వేచ్ఛగా తిరుగుతూ ఆహారం వెతుక్కుంటాయి. గ్రామీణ కుటుంబాల్లో ఇంటి పరిసరాల్లో తిరుగుతూ పురుగులు, ధాన్యాలు, గింజలు తింటూ పెరుగుతాయి. ఈ కారణంగా వీటి ఎదుగుదల నెమ్మదిగా జరుగుతుంది. సాధారణంగా ఒక నాటుకోడి పూర్తిగా పెరగడానికి నాలుగు నుండి ఆరు నెలల వరకు సమయం పడుతుంది. ఈ నెమ్మదైన పెరుగుదల వల్ల కోడి శరీర నిర్మాణం సహజంగా అభివృద్ధి చెందుతుంది. అందువల్ల మాంసం గట్టిగా ఉండి ప్రత్యేకమైన రుచి కలిగి ఉంటుంది. నాటుకోడి కూర వండినప్పుడు వచ్చే సువాసన కూడా ప్రత్యేకంగా ఉంటుంది.

### - బాయిలర్ కోడి అంటే ఏమిటి?

బాయిలర్ కోడి అనేది మాంసం ఉత్పత్తి కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన కోడి జాతి. ఇవి వేగంగా పెరుగే లక్షణం కలిగి ఉంటాయి. పెద్ద పౌల్ట్రీ ఫార్మ్‌లలో వేల సంఖ్యలో పెంచుతారు. బాయిలర్ కోడి పిల్లలు పుట్టిన తర్వాత ప్రత్యేక ఫీడ్ ఇవ్వడం ద్వారా చాలా వేగంగా పెరుగుతాయి. సాధారణంగా 35 నుండి 45 రోజులలోనే మార్కెట్‌కు పంపిస్తారు. ఈ సమయంలో కోడి బరువు సుమారు రెండు కిలోల వరకు ఉంటుంది.

### - బాయిలర్ కోడి వల్ల కలిగే అనుమానాలు

బాయిలర్ కోడి గురించి ప్రజల్లో కొన్ని ఆందోళనలు ఉన్నాయి. అందులో మొదటిది వేగంగా పెరుగుదల, కేవలం 40 రోజుల్లోనే కోడి పెద్దగా పెరగడం సహజ ప్రక్రియ కాదని కొందరు భావిస్తారు. రెండోది ఫీడ్ నాణ్యతపై సందేహాలు,
కొన్ని ఫార్మ్‌లలో ఉపయోగించే ఫీడ్ నాణ్యతపై ప్రశ్నలు తలెత్తుతుంటాయి. కోళ్లకు వేసే దాన మంచిదా లేదా ఏమైనా ఆంటిబయోటిక్స్ లాంటివి ఇస్తున్నారా అన్న సందేహాలు వస్తుంటాయి, మూడోది అతి ముఖ్యమైనది ఆరోగ్య పై ప్రభావం బాయిలర్ కోడి తింటే పిల్లలలో హార్మోన్ల అసమతుల్యత వస్తుందని కొందరు భావిస్తారు. అయితే దీనిపై స్పష్టమైన శాస్త్రీయ ఆధారాలు లేవని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి.

### -నాటుకోడి మరియు బాయిలర్ కోడి మధ్య తేడాలు

నాటుకోడి సహజంగా పెరుగుతుంది. బాయిలర్ కోడి నియంత్రిత వాతావరణంలో పెరుగుతుంది. నాటుకోడి పెరగడానికి నెలలు పడుతాయి, కానీ బాయిలర్ కోడి కేవలం 40 రోజుల్లోనే పెరుగుతుంది. నాటుకోడి మాంసం గట్టిగా ఉండి రుచికరంగా ఉంటుంది. బాయిలర్ కోడి మాంసం మృదువుగా ఉండి త్వరగా ఉడుకుతుంది.

### - పిల్లలపై హార్మోన్ల ప్రభావం.?

చికెన్ మాంసం సాధారణంగా మంచి ప్రోటీన్ వనరు. సరైన విధంగా పెంచిన మరియు శుభ్రంగా వండిన చికెన్ తింటే సాధారణంగా ఆరోగ్యానికి హానికరం కాదు. అయితే ఏ ఆహారం అయినా మితంగా తీసుకోవడం అవసరం. అధికంగా మాంసాహారం తీసుకోవడం ఆరోగ్య సమస్యలకు దారి తీసే అవకాశం ఉంటుంది. అయితే ఒక విషయం నిజం బాయిలర్ కోళ్లలో కొవ్వు శాతం ఎక్కువగా ఉంటుంది
దీంతో స్థూలకాయం, మెటబాలిక్ సమస్యలు పెరిగే అవకాశం ఉంది.

### - ఆరోగ్య దృష్టికోణం

ఆరోగ్య నిపుణులు చెప్పేది ఏమిటంటే, మాంసం ఏదైనా సరే అది శుభ్రంగా, సరిగ్గా వండినట్లయితేనే ఆరోగ్యానికి మంచిది. ఆహారంలో సమతుల్యత ఉండాలి. కూరగాయలు, పండ్లు, ధాన్యాలు, ప్రోటీన్ వనరులు అన్నీ సమంగా తీసుకోవడం అవసరం.

### -చివరిగా..

ఆహారం కేవలం ఆకలి తీర్చడానికి మాత్రమే కాదు, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కూడా కీలకం. సహజంగా పెరిగిన నాటుకోడి మాంసం రుచి, పోషక విలువలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కలిగే లాభాలు వంటి అంశాలను పరిశీలిస్తే చాలా మంది దానిని ప్రాధాన్యంగా తీసుకోవాలని భావిస్తున్నారు. అందుకే "బాయిలర్ కోడి కంటే నాటుకోడి మేలు" అనే అభిప్రాయం ప్రజల్లో పెరుగుతోంది. సహజ ఆహారం వైపు తిరిగి మళ్లడం ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ఒక మంచి సూచికగా చెప్పుకోవచ్చు.

# టిటిడి చైర్మన్ కనిపించడం లేదంటూ పరిపాలన భవనం ముందు బ్యానర్.శ్రీ




తిరుపతి(ప్రశ్న న్యూస్)తిరుమల తిరుపతి దేవస్థానం టిటిడి చైర్మన్ కనిపించడం లేదంటూ టిటిడి పరిపాలన భవనం ముందు బ్యానర్ ఏర్పాటు చేయడం తిరుపతి నగరంలో చర్చనీయాంశంగా మారింది. దేవస్థానం వంటి ప్రతిష్టాత్మక సంస్థకు సంబంధించిన అంశంపై ఇలాంటి బ్యానర్ పెట్టడం చాలా ప్రమాణస్యమైన చర్యగా పలువురు అభిప్రాయపడుతున్నారు.సాక్షాత్తుగా టిటిడి పరిపాలన భవనం సమీపంలో ఈ బ్యానర్ కనిపించడం భక్తులు, స్థానిక ప్రజల్లో ఆశ్చర్యాన్ని కలిగించింది. ఈ ఘటనపై తిరుపతి నగర ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టిటిడి వంటి విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన సంస్థ ప్రతిష్టకు భంగం కలిగేలా ఇలాంటి చర్యలు జరగడం తగదని వారు అంటున్నారు.ఇలాంటి ఘటనలపై టిటిడి అధికారులు వెంటనే స్పందించి, వాస్తవ పరిస్థితులను ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉందని స్థానికులు సూచిస్తున్నారు. ఈ ఘటన ప్రస్తుతం తిరుపతి నగరంలో చర్చనీయాంశంగా మారింది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588